

హక్కులకు కొరవడిన రక్షణ!

ప్రపంచ వ్యాప్తంగా యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన

- రక్షణ, స్వేచ్ఛ కల్పించే ఉద్దేశంతో అమలు
- చట్టబండలుగానే పరిరక్షణ కమిషన్లు, ప్రభుత్వాలు
- ఈ ఏడాది థీమ్ 'మన హక్కులు - మన భవిష్యత్'

- 8లో

నేడు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

అన్నదాతకు భరోసా

రైతులకు మేలు చేసేలా ధాన్యం కొనుగోళ్లు

- ర్యాండమైజేషన్ నిబంధన ఎత్తివేత
- ఏ రైస్ మిల్లుకైనా ధాన్యాన్ని తరలించేలా వెసులుబాటు
- 48 గంటల్లో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ
- జిల్లాలో 72 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- ఖరీఫ్‌లో 30 వేల టన్నులు సేకరించాలని లక్ష్యం



దేవరాపల్లి మండలం ఎం.అలమండలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న లారీకి జెండా ఊపుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి. చిత్రంలో వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ ఉన్నారు.

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ధాన్యం సేకరణ ప్రారంభమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు పడిన ఇబ్బందులను, నెలల తరబడి డబ్బులు అందకపోవడం, అధికారుల వైఫల్యాలు వంటి వాటిని అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో రైతులకు నష్టం లేకుండా ధాన్యం సేకరించేలా అధికారులు ప్రణాళికను అమలు చేస్తున్నారు. గతంలో రైతులను ఇబ్బందులు పెట్టిన ర్యాండమైజేషన్ నిబంధనను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. రైతులు విక్రయించిన ధాన్యాన్ని సమీపంలో వున్న ఏ రైస్ మిల్లుకైనా తరలించుకొనే సౌలభ్యాన్ని కల్పించింది. మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ అయ్యేలా నిధులు అందుబాటులో వుంచడమే కాకుండా ఆ మేరకు బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేసింది.

గత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడ్డారు. రోజుల తరబడి రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ధాన్యాన్ని విక్రయించిన తరువాత ర్యాండమైజేషన్ పేరుతో నిర్దేశించిన రైస్ మిల్లులకు మాత్రమే రైతులు సరఫరా చేసేలా నిబంధనలు అమలు చేశారు. దీంతో ఆయా మిల్లుల వద్ద మరోసారి తూకం వేసేవారు. దూర ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్లలో ధాన్యాన్ని తీసుకెళ్లిన రైతులు మిల్లుల బయట రోజుల తరబడి వేచివుండాల్సి వచ్చేది. అంతేకాక తేమ శాతం, మట్టి బెడ్డలు, తాలు పేరుతో మిల్లర్లు బస్తాకు ఐదారు కిలోల వరకు కోత విధించేవారు. రవాణా చార్జీలను మిల్లర్లు అప్పటికప్పుడు చెల్లించకపోవడంతో రైతులు సొంత సొమ్ము ఇచ్చుకోవాల్సి వచ్చేది. ఇక ధాన్యం డబ్బుల చెల్లింపుల్లో కూడా తీవ్ర జాప్యం జరిగింది. మూడు వారాల్లో డబ్బులు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించగా, ఒక్క రైతుకు కూడా చెప్పిన గడువులోగా డబ్బులు అందిన దాఖలాలు లేవు. ధాన్యం విక్రమించిన రెండు, మూడు నెలల తరువాత బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. వైసీపీ ప్రభుత్వ తీరుతో విసిగిపోయని రైతులు.. తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. అయితే వీటన్నింటిపైనా అధ్యయనం చేసిన కూటమి ప్రభుత్వం.. ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పలు చర్యలు చేపట్టిందిఇ.



అనకాపల్లిలో సేకరించిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

జిల్లాలో 72 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.4 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగినట్టు వ్యవసాయ శాఖ అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దాదాపు 60 వేల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వైసీపీ ప్రభుత్వం 19 వేల టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించగా, ఈసారి ఖరీఫ్‌లో 30 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందు కోసం 378 రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే)ను క్లస్టర్లుగా విభజించి 72 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధాన్యంలో 17 శాతం తేమను ప్రమాణికంగా నిర్ణయించారు. సాధారణ రకం క్వింటా రూ.2,300, గ్రేడ్-ఏ రకం అయితే రూ.2,320లు మద్దతు ధర చెల్లించనున్నారు. మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలం ఎం.అలమండ గ్రామంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రాంభించారు. జిల్లాలో అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభిస్తామని జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం పి.జయంతి తెలిపారు.

రైవాడ ఆధునికీకరణ

రూ.336 కోట్ల 'డ్రిప్' నిధులతో జలాశయం అభివృద్ధి

- కేంద్రం 70%, రాష్ట్రం 30% వ్యయం
- రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- ఆర్థిక శాఖ అనుమతి తరువాత సీడబ్ల్యూసీకి ప్రతిపాదనలు
- వచ్చే ఏడాది ఖరీఫ్‌నాటికి టెండర్లు పిలిచే అవకాశం



రైవాడ రిజర్వాయర్ స్పిల్ వే గేట్లు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లాలో సాగు అవసరాలకు, విశాఖ నగరానికి తాగునీటిని అందిస్తున్న రైవాడ జలాశయం ఆధునికీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చాయి. నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ రిజర్వాయర్‌ను అభివృద్ధి చేయడంతోపాటు నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచడానికి రూ.336 కోట్లను ప్రపంచ బ్యాంకు రుణంగా అందించనున్నది. ఇందులో కేంద్రం 70 శాతం, రాష్ట్రం 30 శాతం భరించాల్సి వుంటుంది. సీడబ్ల్యూసీ ఆమోదం తరువాత వచ్చే ఏడాది ఖరీఫ్‌నాటికి టెండర్లు పిలిచే అవకాశం వుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

శారదా నదిపై దేవరాపల్లి మండలం రైవాడ గ్రామానికి సమీపంలో 1976లో రిజర్వాయర్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 1980 నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యింది. జలాశయం నుంచి సుమారు 22 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. అయితే విశాఖ నగర తాగునీటి అవసరాల కారణంగా ఇంతవరకు 15 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందిస్తున్నారు. జీవీఎంసీకి నిరంతరాయంగా 50 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతున్నది. రిజర్వాయర్ నీటి నిలువ సామర్థ్యం 3.6 టీఎంసీలు. పరివాహక ప్రాంతం ఏజెన్సీలో వుండడంతో ఏటా జలాశయం పూర్తిగా నిండుతుంటుంది. భారీ వర్షాలు కురిసి జలాశయం పూర్తిగా నిండితే స్పిల్‌వే గేట్ల ద్వారా 1.67 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి అనుగుణంగా డిజైన్ చేశారు. అయితే 1990 మే నెలలో సంభవించిన తుఫాన్ దెబ్బకు కుంభవృష్టిగా వర్షాలు కురవడంతో రైవాడ నుంచి రెట్టింపుకన్నా అధికంగా.. అంటే 3.63 లక్షల క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే గేట్ల ద్వారా బయటకు విడుదల చేయాల్సి వచ్చింది. దీంతో ప్రాజెక్టు మనుగడపై ఆందోళన వ్యక్తమైంది. ఆధునికీకరణ విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో స్పిల్‌వేకు పలుచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. గేట్లు సరిగా పనిచేయడంలేదు. అత్యంత ప్రమాదకర స్థితిలో రైవాడ రిజర్వాయర్ ఉందని ఇంజనీరింగ్ నిపుణులు చాలా కాలం నుంచి హెచ్చరిస్తున్నారు. దీంతో ప్రాజెక్టు ఆధునీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన గత వైసీపీ పాలకులు వీటిని అమలుచేయడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైవాడ రిజర్వాయర్ ఆధునికీకరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది.



రైవాడ జలాశయాన్ని సందర్శిస్తున్న సీడబ్ల్యూసీ నిపుణుల బృందం (ఫైల్ ఫొటో)

రూ.336 కోట్లతో ఆధునికీకరణ

డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు-డ్రిప్ కింద రైవాడ రిజర్వాయర్‌ను రూ.336 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో ఆధునీకరిస్తారు. ఇందులో 70 శాతం కేంద్ర ప్రభుత్వం, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ప్రాజెక్టు ఆధునికీకరణకు ఆమోదం కోసం గత నెల 27వ తేదీన సీడబ్ల్యూసీ తరఫున ఇంజనీరింగ్ నిపుణులు జలాశయాన్ని సందర్శించారు..

రెండు దశల్లో పనులు

రైవాడ ఆధునికీకరణ తొలిదశలో ఎర్త్ డ్యామ్, స్లూయిస్, సబ్‌వే, ఇతరత్రా పనులకు రూ.110 కోట్లు విడుదల చేస్తామని, రెండో విడతలో విడుదల చేసే మిగిలిన నిధులతో స్పిల్‌వే, గేట్లు ఆధునికీకరణ పనులు చేపట్టాలని ప్రపంచ బ్యాంకు సూచించింది. అయితే నిధులు మొత్తం ఒకేసారి ఇవ్వాలని జలవనరుల శాఖ కోరింది. మొత్తం నిధుల విడుదలకు ఆమోదం తెలిపితే ఐఐటీ నిపుణులతో పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తరువాతే ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తామని అధికారులు చెప్పడంతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అంగీకరించారు.

కొత్త స్పిల్‌వే నిర్మించాల్సిందే..

నీటి ప్రాజెక్టుకు స్పిల్‌వే కీలకం. అందువల్ల బీటలు వారిన రైవాడ స్పిల్‌వేకు మరమ్మతులు చేయడంకన్నా కొత్త స్పిల్‌వే నిర్మించడం ఉత్తమమని జలవనరులశాఖ ప్రతిపాదించింది. అయితే కాపర్ డ్యామ్ నిర్మించిన తరువాతే స్పిల్‌వే నిర్మించాలి. ప్రస్తుతం ... మిగతా 8వ పేజీలో

డెయిరీపై లోతుగా విచారణ

శాసనసభా కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూ

- ఫ్యాక్టరీస్ అధికారులు, ఆర్థిక రంగ నిపుణులను కూడా కమిటీలో చేర్చి మరోసారి పూర్తిస్థాయిలో పరిశీలన
- అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు
- పాడి రైతులకు, కార్మికులకు న్యాయం చేస్తామని ప్రకటన
- విశాఖ డెయిరీని సందర్శించిన కమిటీ



విశాఖ డెయిరీలో శాసనసభా కమిటీ చైర్మన్, సభ్యులు

గాజువాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

విశాఖ డెయిరీ అక్రమాలపై మరింత లోతుగా విచారణ జరిపి పాడి రైతులకు, కార్మికులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని శాసనసభా కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూ అన్నారు. ఇటీవల జరిగిన శాసనసభా సమావేశాల్లో పలువురు ఎమ్మెల్యేలు విశాఖ డెయిరీ అక్రమాలను ఎండగట్టగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సభా సంఘాన్ని నియమించిన సంగతి తెలిసిందే. జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన సభ్యులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, బొండా ఉమామహేశ్వరరావు, గౌతు శిరీష, ఆర్‌వీఎస్‌కే రంగారావు, దాట్ల సుబ్బరాజులు సోమవారం నగర పరిధిలోని షీలానగర్‌లో గల డెయిరీని సందర్శించారు. డెయిరీ ఎండీ ఎస్‌వీ రమణ, డైరెక్టర్లను విచారించారు. డెయిరీ కార్యకలాపాలపై ఆరా తీశారు. ఆర్థిక వ్యవహారాలపై ప్రశ్నించారు. అనంతరం విలేకరులతో చైర్మన్ నెహ్రూ మాట్లాడారు. విశాఖ డెయిరీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పాడి రైతులు, కార్మికుల నుంచి పలు ఫిర్యాదు అందాయని, వాటన్నింటిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామన్నారు. కంపెనీ చట్టాలు, కో-ఆపరేటివ్ రంగం, ఆర్థిక రంగ నిపుణులను కూడా కమిటీలో చేర్చి త్వరలో మరోసారి పూర్తిస్థాయి విచారణ జరుపుతామన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు డెయిరీ కార్యకలాపాలు సమర్థంగా జరిగే విధంగా చూస్తామన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ డెయిరీ ... మిగతా 8వ పేజీలో

కుంచంగి వీఆర్‌ఓపై సస్పెన్షన్ వేటు

పట్టాదారు పాస్‌పుస్తకంలో తక్కువ విస్తీర్ణం నమోదు

- సరి చేయడానికి రూ.50 వేలు డిమాండ్
- తొలుత రూ.10 వేలు, మరోసారి భార్య ఫోన్‌పేకు రూ.4 వేలు చెల్లింపు
- అయినా రికార్డులు సరిచేయని వీఆర్వో
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు
- విచారణలో వాస్తవమని తేలడంతో సస్పెండ్



బుదిరెడ్డి కృష్ణ, కుంచంగి వీఆర్ఓ

అనకాపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి మండలం కుంచంగి గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) బుదిరెడ్డి కృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే..

కుంచంగి గ్రామానికి చెందిన బండి రామస్వామికి ... మిగతా 8వ పేజీలో

మామిడి పంటకూ బీమా

- ప్రీమియం ఎకరాకు రూ.1,650-2,200
- వాతావరణం ఆధారంగా నష్టపరిహారం చెల్లింపు
- ఎకరాకు కనిష్ఠంగా రూ.33 వేలు, గరిష్ఠంగా రూ.45 వేలు

పేర్లు నమోదుకు ఈ నెల 15 వరకే గడువు



అనకాపల్లి అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో తొలిసారి మామిడి పంటకు బీమాను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నది. మామిడి తోటల సాగు కాలం, జిల్లాలనుబట్టి బీమా కంపెనీ ప్రీమియం నిర్ధారిస్తుంది. అందులో ఎంత శాతం సొమ్మును రైతు భరించాలన్నది ఖరారుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఆరో తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది (2024-25), వచ్చే ఏడాది (2025-25) రబీ సీజన్లలో మామిడి పంటకు పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా కింద 'అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా' బీమాను అమలు చేయనున్నది. అనకాపల్లి జిల్లాకు సంబంధించి ఎకరాకు కనిష్ఠంగా రూ.33 వేలు, గరిష్ఠంగా రూ.45 వేలు బీమా వుంటుంది. మామిడి రైతులు రూ.1,650 నుంచి రూ.2,500 వరకు ప్రీమియంగా చెల్లించాల్సి వుంటుంది. మామిడి తోటలకు బీమా చేయించుకొనే గడువు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. బీమా పథకానికి సంబంధించి ఆయన తెలిపిన మరింత సమాచారం.. ఈ నెల 15 నుంచి వచ్చే ఏడాది మే చివరి వరకు వర్షపాతం, గాలిలో తేమ శాతం, వాతావరణ వ్యత్యాసాలు, గాలుల తీవ్రత ఆధారంగా మండల స్థాయిలో నష్ట తీవ్రతను లెక్కిస్తారు. సాధారణ పంట దిగుబడులతో సరిపోల్చి, వచ్చిన తేడాల ఆధారంగా నష్ట పరిహారం చెల్లిస్తారు. మామిడి తోటలను బీమా చేయించుకోవాలనుకునే రైతులు బ్యాంకులు లేదా మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పోర్టల్‌లో లేదా మొబైల్ ద్వారా కూడా రైతులు నేరుగా బీమాకు దరఖాస్తు చేయవచ్చు. బ్యాంకు ఖాతా జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్సు, పట్టాదారు పాస్ పుస్తకం, పొలంలో మామిడి తోట వున్నట్టు నిర్ధారిస్తూ విలేజ్ అగ్రికల్చర్ లేదా హార్టికల్చర్ అసిస్టెంట్ నుంచి పొందిన ధ్రువపత్రాన్ని అప్‌లోడ్ చేయాల్సి వుంటుంది.



పంటల బీమా పథకం బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ్‌కృష్ణన్, అధికారులు

వరి, మినుము, పెసర పంటలకూ..

రబీలో వరి, మినుము, పెసర పంటలకు కూడా బీమా పథకం వర్తిస్తుంది. వరికి ఎకరాకు రూ.630, పెసర, మినుము పంటలకు రూ.300 చొప్పున ప్రీమియం సొమ్మును ఈ నెల 15లోగా చెల్లించాలి. ఈ మూడు ... మిగతా 8వ పేజీలో



గంజాయి, నిందితులతో డీఎస్పీ శ్రావణి, పోలీసు అధికారులు, సిబ్బంది

110 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్టు

కొత్తూరు (అనకాపల్లి), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

రావికమతం మండలం దొండపూడి చెక్‌పోస్టు వద్ద పోలీసులు 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి సోమవారం ఇక్కడ మీడియాకు వెల్లడించారు. ఏజెన్సీ నుంచి మైదాన ... మిగతా 8వ పేజీలో

4.3 కి.మీ.లు.. రూ.14 కోట్లు!

శృంగవరం- గన్నవరం మెట్ట రోడ్డు అభివృద్ధికి శ్రీకారం

- ఎన్‌డీబీ నుంచి నిధులు మంజూరు చేయించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- రోడ్డు అభివృద్ధితోపాటు మూడు వంతెనలు, పది కల్వర్టుల నిర్మాణం
- ప్రజలకు తొలగనున్న రవాణా కష్టాలు



ఎన్‌డీబీ నిధులు రూ.14 కోట్ల అభివృద్ధి చేయనున్న శృంగవరం-గన్నవరంమెట్ట రోడ్డు

నాతవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

తుని-నర్సీపట్నం ప్రధాన రహదారిలో నాతవరం మండల పరిధిలో అధ్వానంగా వున్న రోడ్డుకు మహర్దశ పట్టింది. శృంగవరం నుంచి గన్నవరంమెట్ట వరకు 4.3 కిలోమీటర్ల రహదారిని రూ.14 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. దీంతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు ఊరట కలగనున్నది. శృంగవరం-గన్నవరంమెట్ట రోడ్డు అభివృద్ధికి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) నిధులు మంజూరు కావడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇటీవల రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

తుని-నర్సీపట్నం మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పలుచోట్ల రోడ్డు ఎత్తు, పక్కనున్న పొలాలకు సమాంతరంగా వుండడంతో వర్షం కురిస్తే రోడ్డుపై నీరు ప్రవహిస్తుంటుంది. ఈ కారణంగా రహదారి త్వరగా పాడవుతున్నది. నాతవరం మండల పరిధిలో శృంగవరం నుంచి గన్నవరం మెట్ట వరకు రోడ్డు మొత్తం ఛిద్రమైంది. గత ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా నిర్వహణ పనులు చేపట్టలేదు. ఎక్కడికక్కడ పెద్దపెద్ద గోతులు ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ గోతుల వద్ద రవాణా వాహనాలు బోల్తా పడడం, పలువురు ప్రాణాలు కోల్పోవడం వంటి సంఘటనలు కూడా జరిగాయి. 2020 అక్టోబర్ రెండో వారంలో తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసి గన్నవరంమెట్ట వద్ద వెర్రిగెడ్డ పొంగి తుని- నర్సీపట్నం రహదారిపై ప్రవహించింది. ఇక్కడ వరద ఉధృతికి కార్లు కొట్టుకుపోయి ఇద్దరు మృత్యువాత పడ్డారు. అంతేకాక భారీ వర్షాలు ... మిగతా 8వ పేజీలో

తాండవ గట్లపై అక్రమ నిర్మాణాలు

- తాత్కాలిక పాకల స్థానంలో పక్కా భవనాల నిర్మాణం
- పట్టించుకోని ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఆందోళన చెందుతున్న పాయకరావుపేట, తుని ప్రజలు

పాయకరావుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట, తుని పట్టణాల మధ్య ప్రవహిస్తున్న తాండవ నదికి ఇరువైపులా ఉన్న గట్లపై గతంలో నిరుపేదలు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న పాకలు ప్రస్తుతం పక్కా భవనాలుగా మారుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరదలు వచ్చి నది గట్టుపై ఉన్న భవనాలతోపాటు వంతెనకు ముప్పు వస్తే ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పాయకరావుపేట, తుని పట్టణాల మధ్య ప్రవహిస్తున్న తాండవ నది గట్లు ఆక్రమణల పాలవుతున్న విషయం తెలిసిందే. పట్టణంలో వంతెన నుంచి ముఠా ఆనకట్ట వరకు 1,500 మీటర్ల పొడవున్న నదికి ఇరువైపులా గట్టుపై గతంలో తాత్కాలికంగా పాకలు నిర్మించుకుని నివాసముంటున్న నిరుపేదల నుంచి కొనుగోలు చేస్తున్నవారు గత కొంతకాలంగా పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా వంతెనను ఆనుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంతో బ్రిడ్జికి ముప్పు వాటిల్లుతుందని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలిసినా రెండు జిల్లాల ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోని కారణంగా తుని వైపు తాండవ వంతెనకు ఆనుకుని ఇరువైపులా షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇదిలావుండగా తాండవ నది గట్టుపై గతంలో నిర్మించిన ఇంటిని ఆనుకుని కొత్తగా శ్లాబువేసి షాపు నిర్మాణ పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. ఇది పూర్తయితే షాపు ఎదురుగా వంతెనపై ఐరన్ రైలింగ్ తొలగించబడుతుంది. సుమారు మూడు దశాబ్దాల క్రితం నదిపై నిర్మించిన వంతెనను పట్టించుకున్నవారు లేక ఇరువైపులా ఉన్న ఐరన్ రైలింగ్ 90 శాతం కూలిపోయింది. ప్రస్తుతం పక్క నిర్మాణాలు చేపట్టడం వలన మరోమారు వరదలు వస్తే వంతెన పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికైనా రెండు జిల్లా అధికారులు స్పందించి పట్టణంలో తాండవ నదిపై ఉన్న వంతెనకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు వంతెన పటిష్ఠతకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వంతెన రైలింగ్‌ను ఆనుకుని నది గట్టుపై జరుగుతున్న పక్కా నిర్మాణం

జనవాణికి విశేష స్పందన

- ప్రజా సమస్యల పరిష్కారానికే నిర్వహణ
- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన జనవాణికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు అర్జీలను అందజేశారు. భూ సమస్యలు, శాంతి భద్రతలు, కొత్తపింఛన్లు, రేషన్ కార్డులు తదితర అంశాలకు సంబంధించి 300 వరకు అర్జీలను ఎమ్మెల్యేకు ప్రజావాణిలో అందజేశారు. కాలుష్య సమస్యలతో సతమతమవుతున్న లాలంకోడూరు గ్రామాన్ని తరలించాలని జనసేన పార్టీ యువత నేత లాలం చందు, యువకులు ఎమ్మెల్యేకు అర్జీని అందజేశారు. ఒక పక్క ఎస్ఈజడ్‌లోని పరిశ్రమలు నుంచి వెదజల్లే కాలుష్యం, మరోపక్క పలు కంపెనీల నుంచి వెలువడే వ్యర్థ జలాలను గ్రామానికి ఆనుకొని ఉన్న కాలువల్లోకి వచ్చేస్తుండడంతో గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను చందు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయకుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమానికి వచ్చిన వ్యక్తులతో ఎమ్మెల్యే విజయకుమార్ ఆప్యాయంగా మాట్లాడి వారి వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సకాలంలో పరిష్కరిస్తానని అర్జీదారులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకకే జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు టీడీపీ, జనసేన రాంబిల్లి మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే విజయకుమార్‌కు అర్జీని అందజేస్తున్న జనసేన పార్టీ యువత నేత చందు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి : రఘువర్మ

పాయకరావుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలపై మండలిలో చర్చించి పరిష్కారానికి కృషిచేస్తున్నానని ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోమారు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏపీటీఎఫ్ తనను ప్రకటించిదన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన పట్టణంలో పలు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నం.117 రద్దు, అప్పో భారం తగ్గించడం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని వివరించారు. అదే విధంగా రావాల్సిన డీఏ, సరెండర్ లీవ్ బకాయిలు, విద్యా విధానంలో రావలసిన మార్పులు తదితర సమస్యలపై కృషిచేస్తున్నానన్నారు. వచ్చే ఏడాది జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను మరోమారు ఎమ్మెల్సీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు షేక్ రహీమ్, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, బీవీ.ప్రసన్నకుమార్, కె.నూకరాజు, రాష్ట్ర కౌన్సిలర్ పి.గణేష్, వి.శ్రీనివాసరావు, డి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


పాయకరావుపేటలో జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసిన ఎమెల్సీ పి.రఘువర్మ

భవానీ దీక్షాపరుల కోసం ప్రణాళికలు

- ట్రస్టు రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు శ్రీపాద



నక్కపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలతో సహా ఆరు రాష్ట్రాల్లో ఏటా లక్షలాది మంది భక్తులు భవానీ దీక్షలు చేపడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో ప్రధాన భూమిక పోషిస్తున్నారని ఆల్ ఇండియా భవానీదీక్షా ఛారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు శ్రీపాద సత్య భాస్కర ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడిగా ఆదివారం ట్రస్ట్ జాతీయ అధ్యక్షుడు లంకా గణేశ్ నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో సైతం వేలాదిమంది పేద, మధ్యతరగతి కుటుంబాల వారు ఇతరుల సాయం లేకుండా, సొంత డబ్బులతో భవానీ దీక్షలు చేపడుతున్నారన్నారు. అటువంటి దీక్షాపరులు, గురుభవానీల సంక్షేమం కోసం, కష్టకాలంలో వారిని ఆదుకోవడం కోసం ట్రస్ట్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తోందని చెప్పారు. త్వరలో అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఇదే సమయంలో భవానీ దీక్షా ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలకు భంగం కలగకుండా కృషి చేస్తామని, ఇప్పటికే కొన్ని సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి ట్రస్ట్ సెంట్రల్ కమిటీ సభ్యులు తీసుకెళ్లినట్టు ప్రసాద్ చెప్పారు.

లీజు పూర్తయిన బీసీటీ భూములను స్వాధీనం చేసుకోవాలి

- కలెక్టర్‌కు అప్పారాయుడుపాలెం, పంచదార్ల గ్రామస్థులు వినతి

రాంబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లీజు పూర్తయిన భాగవతుల చారిటబుల్ ట్రస్టు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అప్పారాయుడుపాలెం, పంచదార్ల గ్రామస్థులు సోమవారం కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వారు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పంచదార్ల పుణ్యక్షేత్రం దేవదాయ, ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో ఉందన్నారు. పంచదార్ల రెవెన్యూలో ప్రభుత్వ భూములను ధర్మిక కార్యక్రమాలు నిమిత్తం బీసీటీ సంస్థకు లీజుకు గత ప్రభుత్వాలు ఇచ్చాయన్నారు. భూముల లీజు ముగిసి ఐదేళ్లు అవుతుందని, ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు. మండలంలోని పలు గ్రామాల వారికి పునరావాస కాలనీ నిర్మించేందుకు పంచదార్ల పుణ్యక్షేత్రానికి కొంత దూరంలో ఉన్న ప్రభుత్వ భూములకు ఏపీఐఐసీ వారు పరిశీలన చేశారన్నారు. దీంతో గ్రామస్థులు, హిందూ ధార్మిక సంఘాలు ఆందోళనకు గురయ్యాయన్నారు. పంచదార్ల పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు గాని, గ్రావెల్ తవ్వకాలు గాని చేపట్టినట్టయితే భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ముందన్నారు. పంచదార్ల పుణ్యక్షేత్రం సమీపంలో ఎటువంటి గ్రావెల్ తవ్వకాలకు గాని, ప్రభుత్వ పునరావాస కాలనీలకు గాని, అనుమతులు ఇవ్వకూడదని వారు జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో కోరినట్టు పంచదార్ల మాజీ సర్పంచ్ అనకాపల్లి సరస్వతి, అప్పారాయుడుపాలెం పంచాయతీ ప్రజాసంఘం నాయకులు ఉరిటి నారాజీ, నానేపల్లి సన్యాసిరావు తెలిపారు.

మత్తులో పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు : ఎస్ఐ

కోటవురట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల మత్తులో పడి.. బంగారు భవిషత్తును నాశనం చేసుకోవద్దని కోటవురట్ల ఎస్ఐ రమేష్ సూచించారు. మండలంలోని జల్లూరు జడ్పీ హైస్కూల్‌లో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగం, రవాణా, వాటి వినియోగం తీవ్రతను వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పట్ల క్రమశిక్షణతో ఉండి, వారిని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

బెదిరించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళుతున్న తనను కుంచవానిపాలెం గ్రామానికి చెందిన కాయల సత్తిబాబు అడ్డుకుని, కొట్టి చంపుతానని బెదిరించినట్టు అదే గ్రామానికి చెందిన మైలపల్లి రేనేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. రేనేశ్వరరావు ఈ నెల 7వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇరువాడ నుంచి కుంచవానిపాలెం వస్తున్నాడు. దారిలో సత్తిబాబు అడ్డుకుని చేతులుతో కొట్టడమే కాకుండా చంపుతానని బెదిరించాడు. అంతేకాక కులం పేరుతో దూషించాడు. ఈ మేరకు ఫిర్యాదు అందగా.. సత్తిబాబుపై సోమవారం ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

మండల పరిషత్ ప్రజావేదికకు అర్జీలు నిల్

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో సోమవారం విడివిడిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ స్పందనకు మూడు అర్జీలు వచ్చినట్టు డీటీ శేషుబాబు తెలిపారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి పర్యవేక్షణలో మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికకు ఒక్క అర్జీ కూడా రాకపోవడం విశేషం.

జనసేన కార్యకర్తకు బీమా చెక్కు పంపిణీ


బీమా చెక్కును రాజుకు అందజేస్తున్న మంత్రి మనోహర్

రాంబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొప్పుగొండుపాలెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త మడగల రాజుకు రూ.25,700 బీమా చెక్కును సోమవారం సాయంత్రం విశాఖపట్నంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ అందజేశారని జనసేన పార్టీ మండల అధ్యక్షులు పప్పల నూకన్నదొర తెలిపారు. రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడన్నారు. ఎమ్మెల్యే విజయకుమార్ చొరవతో మంజూరైన బీమా మొత్తాన్ని మంత్రి అందజేశారని నూకన్నదొర తెలిపారు.

కూటమి కార్యకర్తలకు అందుబాటులో ఉంటా : అబద్ధం


టీడీపీ కార్యాలయంలో నేతలతో మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు అబద్ధం

ఎస్. రాయవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తెలిపారు. సోమవారం మండ ల పరిషత్ కార్యాలయంలో ఆయన నాయకులతో మాట్లాడుతూ..కూటమి నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో నూతనంగా కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటానన్నారు. మొదటిరోజు సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు పార్టీ కార్యాలయంలో ఆయన అందుబాటులో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుంపాల నాగేశ్వరరావు, పల్లెల జగ్గారావు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నీలకంఠేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటాపురంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వయంభూగా వెలసిన శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి (తాతాజీ), ఎంపీటీసీ సభ్యుడు మద్దాల వీరునాయుడు, మాజీ సర్పంచ్ సుందరపు వెంకటకనక అప్పారావు, పాల సొసైటీ అధ్యక్షుడు సుందరపు కాసులుబాబు తదితరులు పాల్గొన్నారు.

పాములవాక జడ్పీ పాఠశాల వంటశాలకు రూ.22 లక్షలు

కోటవురట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాక జడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న వంటషెడ్డు నిర్మాణానికి ఐపీఎస్ కిల్లాడ సత్యనారాయణ సహకారంతో గెయిల్ కంపెనీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ. 23 లక్షలు మంజూరైనట్టు వైసీపీ మండల కన్వీనర్ కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. నాడు-నేడు నిధులు చాలకపోవడంతో వంటశాల నిర్మాణం సగంలో ఆగిపోయిందన్నారు. ఈ విషయాన్ని కిల్లాడ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన గెయిల్ కంపెనీ సీఎస్ఆర్ నిధులను మంజూరు చేయించారన్నారు.

రైతుల బాగోగులను విశాఖ డెయిరీ చూస్తోంది

- కమిటీని కలిసిన పాల సొసైటీల అధ్యక్షులు

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలు కాలంగా పాడి రైతుల బాగోగులను విశాఖ డెయిరీ యాజమాన్యం చూస్తోందని శాసనసభ కమిటీకి చెప్పామని చూచుకొండ పాల సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల నాయుడు తెలిపారు. సోమవారం విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయం వద్ద కమిటీ సభ్యులను కలిశామన్నారు. విశాఖ డెయిరీకి పాలు పోసే రైతుల కుటుంబీకులకు విద్య, వైద్య సేవలను కూడా అందిస్తున్నారన్న విషయాన్ని చెప్పామన్నారు. తప్పుడు నిర్ణయాల కారణంగా ఇప్పటికే జిల్లాలో షుగర్ ఫ్యాక్టరీలు నిర్వీర్యం అయ్యాయని, అటు వంటి దుస్థితి విశాఖ డెయిరీకి పట్టకుండా కాపాడాలన్నారు. శాసనసభ కమిటీని కలిసిన వారిలో మునగపాక, గణపర్తి, మూలపేట తదితర గ్రామాల పాల సొసైటీల అధ్యక్షులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల ధర్నా


బస్టాండ్ జంక్షన్ వద్ద మానవహారం చేస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. బస్టాండ్ జంక్షన్ నుంచి ప్రధాన రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ బకాయిలు ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేయాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ నంబరు 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకం అమలు చేసి పేద విద్యార్థులకు ఉపయోగపడేలా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ వినయకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సింహాద్రి. ఇర్మియా. శ్యామల, కావేరి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు


నీటిపథకం శంకుస్థాపనకు కూటమి నేతల పూజలు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. మండలంలోని సత్యవరంలో సోమవారం నీటిపథకం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హోంమంత్రి అనిత ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలోనూ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సత్యవరంలో తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు రూ. 85 లక్షలతో నీటి పథకాన్ని మంజూరు చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలలో రోడ్లు, తదితర అభివృద్ధి పనులు చేపట్టారన్నారు.కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ ఫణివర్మ, సర్పచ్ సఖిలేటి రాము, టీడీపీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, గొర్లె రాజుబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, దేవవరపు రాజుబాబు, చిక్కాల శ్రీను, మజ్జూరి నారాయణరావు, చించలపు ప్రదీప్, చింతకాయల రాంబాబు, గోపీరాజు, అప్పారావు, కీర్తి సీతారాం, వాసు, ఏనుగు చిన్నా, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలి

- ఏపీఐఐసీ జెడ్ఎంకి పూడిమడక సర్పంచ్ వినతి


ఏపీఐఐసీ జెడ్ఎం హరిప్రసాద్‌కి వినతిపత్రాన్నిస్తున్న వెంకటరమణ

అచ్యుతాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాలుష్య జలాల కారణంగా పూడిమడక వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తగిన నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని తరపున ఆమె భర్త వెంకటరమణ ఏపీఐఐసీ జెడ్ఎం జహరిప్రసాద్‌కి వినతిపత్రాన్ని అందజే శారు. ఫార్మా కర్మాగారాల నుంచి విడుదల చేస్తున్న కాలుష్యకారక వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాత బయటకు విడిచి పెట్టాలన్నారు. వ్యర్థ జలాలను కాలువల్లోవిడిచిపెట్టడంతో అవి ప్రధాన ఉప్పుటేరులో కలుస్తున్నాయని. తద్వారా సముద్రంలో చేరి మత్స్య సంపద నశిస్తోందరు. ఇదే విధానం కొనసాగితే భవిష్యత్తులో పూడిమడక మత్స్యకారుల జీవనోపాధికే విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్లె ధర్మవరం శివారు మెట్టధర్మవరంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమాల్లో ఏపీ రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. లంకధర్మవరం, వెంకటాపురం, గొర్లెధర్మవరం, సెజ్ పునరావాస కాలనీ తదితర గ్రామాల నుంచి భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో రాయి శ్రీనివాసరావు, పి. మారేష్, గొర్లె పెంటారావు, రామజోగి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని వినతి

అచ్యుతాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడుతూరు పంచాయతీ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను కాపాడాలంటూ కూటమి సభ్యులు కోరారు. ఈమేరకు సోమవారం మడుతూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో డీటీ శ్యామ్‌కి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సదస్సులో 11 మంది రైతులు తమ భూసమస్యలతోపాటు పాస్ పుస్తకాలు ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. సర్వే నంబరు 293లో 5.57 ఎకరాలు రుద్రభూమికి గతంలో కేటాయించారు. ఇందులో చాలా భాగం ఆక్రమణలకు గురైంది. వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీనిపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మోటూరు సంజీవి, కూటమి నాయకులు మోటూరు శ్రీవేణి, శనివాడ ఆనందరావు, వీఆర్వో సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె


చితి చుట్టూ తిరుగుతున్న కుమార్తె సత్యవతి

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తల్లికి తలకొరివి పెట్టి కుమార్తె మాతృమూర్తి రుణం తీర్చుకుంది. మండలంలో నాగులాపల్లి గ్రామానికి చెందిన భీమరశెట్టి లక్ష్మి(80) సోమవారం మృతి చెందారు. ఆమెకు ఉన్నది ముగ్గురు సంతానం కుమార్తెలే కావడంతో వారిలో ఒకరైన పెద్దకుమార్తె కాండ్రేగుల సత్యవతి తలకొరివి పెట్టింది. అల్లుళ్లు పాడి మోశారు.

జంపపాలెంలో గాంధీ విగ్రహావిష్కరణ


గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మహాత్మగాంధీజీ విగ్రహాన్ని విగ్రహ దాతల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఘనంగా విగ్రహావిష్కరణ నిర్వహించారు. గ్రామానికి చెందిన స్వర్గీయ యల్లపు సోములు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు యల్లపు వెంకటసూరి అప్పారావు, విల్లూరి సన్యాసమ్మ, ఎస్.కుమారి, వి.తులసీరామ్, స్వాతి విగ్రహానికి ఆర్థిక సాయాన్ని అందించారు. సోమవారం స్కూల్ ఆవరణలో దాతల సమక్షంలో సర్పంచ్, పెద్దలు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం. శాస్త్రి, ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, దేవకీనాయుడు, కర్రి అప్పన్న, మాజీ సర్పంచ్ శ్రీరాములు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

రాంబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో ఈనెల 13,14 తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ కోరారు. సోమవారం మండల కేంద్రంలో వారు ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్, రాజేష్, తరుణ్, శ్రీను, గోపి విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సోమలింగపాలెం గ్రామదేవత జాతర

ఎలమంచిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెంలో గ్రామ దేవత జంపమాంబ అమ్మవారి జాతర మంగళవారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ప్రతీ మూడేళ్లకు ఒకసారి జరిగే అమ్మవారి జాతరను ప్రత్యేకంగా జరుపుకుంటారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

మునిసిపల్ పారిశుధ్య కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మునిసిపల్ పారిశ్యుధ కార్మికులు

ఎలమంచిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మునిసిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కార్మిక సోదరులంతా తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన చేపట్టామన్నారు. కార్మికులు ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా ప్రజారోగ్యమే తమ విధిగా చేసుకుని విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్మికులకు మంజూరు చేయాల్సిన సబ్బులు, నూనెలు, ఇతరత్రా అలవెన్సులు మంజూరు చేయడంలో జాప్యం తగదన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులు మరణించినా, పదవీ విరమణ పొందినా వారి కుటుంబ సభ్యులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నేతలు వై.నూకరాజు, సీహెచ్. వెంకటరమణ, ఈ. చంద్రరావు, డి.మహేష్, వై. దుర్గారావు, జె. వెంకటరమణ, ఎం.నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ



గర్భిణులకు భోజనాలు అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక ఆర్యోగ కేంద్రంలో సోమవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేశారు. ప్రతీ నెలా 9వ తేదీన అధిక సంఖ్యలో గర్భిణులు వైద్య పరీక్షల నిమిత్తం పీహెచ్‌సీకి వస్తుంటారు. వీరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దాతలు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ రాయపూడి జయప్రకాష్, కార్యదర్శి సత్యనారాయణ, కట్టమూరి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాకు గడువులోగా ప్రీమియం చెల్లించాలి

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం ద్వారా రబీ సీజన్ 2024-25 పంటల బీమా పథకం అందుబాటులోకి వచ్చిందని, గడువు తేదీల్లోగా ప్రీమియం చెల్లించాలని మండల ఏవో తెలిపారు. వరి పంట బీమా ఈనెల 31 వరకు గడువు ఉందని, ఎకరాకు రూ.630 ప్రీమియంగా చెల్లించాలన్నారు. అదేవిధంగా మినుములు, పెసర బీమా గడువు ఈనెల 15తో ముగిస్తుందన్నారు. ఎకరాకు రూ.300 ప్రీమియంగా చెల్లించాలని తెలిపారు. మినుములు అందుబాటులో ఉన్నాయని, 4 కేజీల బ్యాగ్ రూ.392 అని చెప్పారు. కొంత మంది రైతులు నువ్వు విత్తనాలు అడుగుతున్నారని, అవి ప్రస్తుతానికి లేవన్నారు.

ధాన్యం పారదర్శకంగా అమ్ముకోండి

- దళారుల ప్రమేయం లేకుండా విక్రయించుకోండి
- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దళారుల ప్రమేయం లేకుండా రైతులు పారదర్శకంగా మిల్లర్లకు ధాన్యం అమ్ముకోవచ్చని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. మండలంలోని ఎం.అలమండ గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోతల పాత్రునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోనే మొదటిగా ఇక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. యాంత్రీకరణ ద్వారా వ్యవసాయం చేస్తే ఖర్చులు ఆదా చేయవచ్చన్నారు. ఎటువంటి తరుగులైనా, ఎవరు ఇబ్బందులు పెట్టినా జిల్లా టోల్ ఫ్రీ నంబరు 8008901584కు ఫోన్ చేస్తే పరిష్కారమవుతుందని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం 378 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆయిషా, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ విజయంతి, డీఎస్‌వో మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, సిహెచ్‌రవీంద్రనాథ్, వ్యవసాయ అధికారి కాంతమ్మ, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ జగన్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయన, జనసేన నాయకుడు రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో రైతులకు ఎంతో మేలు


యంత్రం ద్వారా వరి కోస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా రైతుకు అన్ని విధాలా మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని ఎం.అలమండలో ఎమ్మెల్యే బండారు పొలంలో వరి కోత యంత్రం ద్వారా సోమవారం పంట కోశారు. ఈ విధానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వరి కోత మిషన్ వల్ల ఎకరాకు రూ.10 వేల వరకు మిగులుతుందన్నారు. గంటలో ఎకరా పొలం కోయవచ్చన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, ఏవో కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 11 అర్జీలు


వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టరేట్ పరిపాలన అధికారి

నర్సీపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 11 అర్జీలు వచ్చాయి. ఆర్డీవో వీవీ రమణ గ్రామ సభలకు హాజరు కావడంతో కార్యాలయం పరిపాలనాధికారి సూర్యనారాయణ వినతిపత్రాలు స్వీకరించారు. నర్సీపట్నం మండలం నీలంపేట గ్రామం సర్వే నంబరు 82-8లో శింగంపల్లి లక్ష్మీనారాయణ, మొండెం మోహన్, గొల్లి రాజు, గొల్లి సత్తిబాబు గ్రామానికి చెందిన బోళెం చినదేముడు, బోళెం తాతాలు, బోళెం రాజుబాబు, బోళెం గంగరాజు వద్ద నుంచి 1991, 1996 సంవత్సరాల్లో స్థలాలు కొనుకున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయమంటే బాండ్ పేపరు మీద రాసి సంతకాలు చేసి పంచాయతీ ముద్ర వేసి ఇచ్చారని తెలిపారు. ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకొని ఉన్నామని, పంచాయతీ పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు స్థలం మీద బోళెం కుటుంబ సభ్యులు బ్యాంకు రుణాలు తీసుకొని చెల్లించకపోవడంతో తమకు నోటీసులు వస్తున్నాయని శింగంపల్లి లక్ష్మీనారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేసి పట్టా ఇవ్వలేదని మునిసిపాలిటీ పరిధి గచ్చపు వీధికి చెందిన జె.మహాలక్ష్మి వినతిపత్రం అందించారు. ఇంటి కోసం విద్యుత్ మీటరుకి దరఖాస్తు చేసుకుంటే పట్టా అడుగుతున్నారని ఆమె పేర్కొన్నారు. పట్టా ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

ఆర్అండ్‌బీ స్థలంలో పునాదుల ధ్వంసం


ఆర్అండ్‌బీ కార్యాలయం ఎదురుగా మెయిన్ రోడ్డును అనుకున్న స్థలం ఇదే..

నర్సీపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్డును ఆనుకొని రూ.కోట్లు విలువ చేసే ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణ కాకుండా ఆ శాఖ నిర్మించిన పునాదులను ప్రైవేటు వ్యక్తి ధ్వంసం చేశాడు. ఆర్అండ్‌బీ కార్యాలయం ఎదురుగా సుమారు పది సెంట్ల స్థలం మెయిన్ రోడ్డును ఆనుకొని ఉంది. ఆ స్థలం వెనక ప్రైవేటు స్థలం ఉంది. ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణకు గురికాకుండా మూడేళ్ల క్రితం అధికారులు రాతికట్టు పునాది నిర్మాణం చేశారు. ఇటీవల ఆర్అండ్‌బీ స్థలం వెనక ప్రైవేటు స్థలంలో నిర్మాణం మొదలు పెట్టారు. దీని కోసం ఆర్అండ్‌బీ స్థలంలో నిర్మించిన పునాదులు తవ్వేశారు. ఈ స్థలం పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. అయితే ప్రైవేటు స్థలంలో నిర్మాణం మొదలు పెట్టారన్న సమాచారం తెలిసి గత సోమవారం డీఈఈతో కలసి స్థలాన్ని పరిశీలించామని జేఈ తెలిపారు. అప్పటికే కొంత మేర పునాదులు తవ్వేసి ఉండటంతో ప్రైవేటు స్థలం యజమానిని పిలిచి అడిగామన్నారు. మెటీరియల్ వేసుకోవడానికి పునాది కొంత తవ్వామని, తర్వాత కట్టి ఇస్తామని యజమాని చెప్పారని ఆర్అండ్‌బీ జేఈ నారాయణరెడ్డి తెలిపారు. స్థలం ఆక్రమణ కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

'టీడీపీ సభ్యత్వంతో ప్రమాద బీమా'

చీడికాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి గవిరెడ్డి జగన్నాథం చెప్పారు. అప్పలరాజుపురం గ్రామంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా పార్టీ పనిచేస్తున్నదనానరు. సభ్యత్వ నమోదుకు అందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురచా లక్ష్మినాయుడు, వెంకునాయుడు, రామునాయుడు, పరవాడ దేముడునాయుడు, గణేశ్ పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిపై కేసు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం గొలుగొండ మండలం సీహెచ్.నాగాపురం శివారు జీడి తోటల్లో కోడి పందేలు ఆడుతున్నట్టు ఫిర్యాదు అందిందని చెప్పారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వారిపై కేసు నమోదు చేసి నాలుగు కోడిపుంజులు, రూ.2,100 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు.

కష్టాలు ఆపార్ం

ఆపార్ నంబర్ల కేటాయింపు కొత్త తలనొప్పులు తెచ్చి పెడుతోంది. విద్యార్థుల చదువుకు సంబంధించి సమస్త వివరాలతో కూడిన డేటా ఒక్క చోటే లభ్యమయ్యేలా ఆపార్ నంబర్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారి పాలిట శాపంగా మారింది. ఆధార్ కార్డులోని తప్పిదాలు ఉండడం.. బర్త్ సర్టిఫికెట్లలో వివరాలు సక్రమంగా లేకపోవడం.. సర్వర్ మొరాయించడం తదితర కారణాలతో ఆపార్ నంబర్ కేటాయింపునకు అనేక చిక్కులు ఎదురవుతున్నాయి.

ఐడీ నంబర్ ఆన్‌లైన్‌కు అడ్డంకులు

- ఆధార్, బర్త్ సర్టిఫికెట్లలలో తేడాలతో రిజక్ట్
- ఆధార్ అప్‌డేట్‌కు విద్యార్థులకు తిప్పలు
- నమోదు కేంద్రాల వద్ద రోజంతా పడిగాపులు


పంచాయతీ కార్యాలయంలో ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల పడిగాపులు

చోడవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

ఆపార్ నమోదు కోసం ఆధార్‌లోని తప్పులు సరిదిద్దుకొని తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల సూచనతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో కేంద్రాల వద్ద రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. గత కొద్ది రోజులుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గంటల తరబడి ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అక్కడ కూడా సర్వర్ మొరాయిస్తుండడంతో రోజుల తరబడి ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఆధార్ కార్డుల్లో చిన్నపాటి తప్పులు ఉన్నా సాఫ్ట్‌వేర్ తిరస్కరిస్తుండడంతో విద్యార్థులు ఆధార్ తప్పనిసరి పరిస్థితుల్లో కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఆధార్‌లో తప్పులు సరిదిద్దుకునేందుకు మీ సేవా కేంద్రాలు, ఆధార్ సెంటర్లతో పాటు పోస్టాఫీసు, బ్యాంకులకు వద్దకు వెళుతున్నా, కార్డులలో తప్పిదాలు వెంటనే దిద్దుబాటు కాకపోతుండడంతో పడరాని పాట్లు పడుతున్నామని విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫోన్ నంబర్, బయోమెట్రిక్ సమస్యలు మాత్రమే..

ఆధార్ కార్డుల్లో ఫోన్ నంబర్ అనుసంధానం, బయోమెట్రిక్ సమస్యలు మాత్రమే దిద్దుబాటు జరుగుతున్నాయని, మిగిలిన విద్యార్థుల డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌లో పేర్లతో దొర్లిన తప్పిదాలు ఎంతకీ సర్దుబాటు కావడం లేదని చెబుతున్నారు. ప్రత్యేకించి డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో హోల్డ్‌లో పెట్టడం, లేదంటే తిరస్కరిస్తుండడంతో విద్యార్థులు రోజుల తరబడి ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురిస్తోంది.


చోడవరంలోని పోస్టాఫీసు ఆధార్ కేంద్రంలో తప్పుల దిద్దుబాటు నిరీక్షిస్తున్న విద్యార్థులు

బర్త్ సర్టిఫికెట్లతో తంటా..

18 ఏళ్లలోపు విద్యార్థులకు పుట్టిన తేదీల్లో మార్పులకు సంబంధించి కొత్తగా డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి వస్తున్నది. చాలా మంది విద్యార్థులకు పుట్టిన తేదీలకు సంబంధించి డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు లేవు. వారికి సంబంధించిన సమాచారం పంచాయతీల్లో లేకపోవడంతో అటువంటి వారంతా దళారులను పట్టుకుని, విశాఖ కేజీహెచ్ నుంచి సర్టిఫికెట్లు పుట్టించుకుని తెచ్చి సమర్పిస్తున్నట్టు సమాచారం. ఇలా తెచ్చిన సర్టిఫికెట్లలో చాలా వరకూ స్టాంపులు కూడా లేకుండా బోగస్ సర్టిఫికెట్లు ఇస్తున్నట్టు చెబుతున్నారు. ఇంత కష్టపడి సర్టిఫికెట్ తెచ్చినా, స్కూల్ రికార్డులో వివరాలకు విద్యార్థులు తెచ్చిన సర్టిఫికెట్లకు పొంతన లేకపోవడంతో అటువంటి దరఖాస్తులు ఆధార్ సిస్టం హోల్డ్‌లో పెడుతున్నట్టు సమాచారం. ఈ విధంగా ఒక్కో కేంద్రంలో 200 పైగా దరఖాస్తులు హోల్డ్‌లో ఉండిపోయినట్టు చెపుతున్నారు. వారి ఆధార్ కార్డుల్లో మార్పులు అసలు అవుతాయా? లేదా? అనేది ఆధార్ కేంద్రాల నిర్వాహకులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. ఫలితంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లకుండా ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇలా కాకుండా విద్యార్థులకు సంబంధించి పాఠశాలలు, కళాశాలల్లోనే ఉన్న సమాచారంతోనే ఆధార్ కార్డుల్లో మార్పులకు అవకాశం కల్పిస్తే తప్ప ఈ సమస్యలు అంత త్వరగా తీరే పరిస్థితి ఉండదని ఆధార్ కేంద్రాల సిబ్బంది అంటున్నారు. వీటిపై ప్రభుత్వం స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో విద్యార్థులకు ఇక్కట్లు తప్పవని చెబుతున్నారు. ఈ కష్టాలపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

డేట్ ఆఫ్ బర్త్‌లో తప్పులు సరిదిద్దుకోవడానికి తిరుగుతున్నా



ఆధార్ కార్డులోని డేట్ ఆఫ్ బర్త్‌లో తప్పులు సరిదిద్దుకోవడానికి పోస్టాఫీసులోని ఆధార్ కేంద్రానికి వచ్చాను. రెండు రోజుల తరువాత రావాలని చెప్పారు. కాలేజీకి సెలవు పెట్టుకుని ఆధార్ కేంద్రానికి రావాల్సి వస్తున్నది.

-ఎన్.భవానీ, ఇంటర్ సెకెండియర్, కొత్తపల్లి

ఆధార్ కార్డులో మార్పుల కోసం వచ్చా



పుట్టిన తేదీలోను, స్కూల్ రికార్డుకు ఆధార్ కార్డులో తేదీలకు తేడా వచ్చింది. వాటిని దిద్దుబాటు చేసుకునేందుకు ఆధార్ కేంద్రానికి తిరుగుతున్నాను. ఈ సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలీడం లేదు.

-శ్రీజయ. ఇంటర్, గోవాడ

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

- నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ

నాతవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ తెలిపారు. మండలంలోని జిల్లేడిపూడి గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను ఈ సదస్సులు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆయన ఆదేశించారు. అలాగే సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లేడిపూడి సదస్సులో 31 అర్జీలను స్వీకరించినట్టు చెప్పారు. ఈ అర్జీలలో మ్యూటేషన్, ఫ్యామిలీ సర్టిఫికెట్‌లు, భూ సమస్యలపై ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ శివ, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వో మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. సిహెచ్.నాగాపురం, కుమారుపురం గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న ప్రజలంతా రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. పట్టాదారు పాసు పుస్తకాల్లో విస్తీర్ణం ఎక్కువ, తక్కువ, పాసు పుస్తకాల్లో పేర్ల మార్పులు కోసం రైతులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ నాగరాజు, వీఆర్‌వోలు రాజు, సత్యనారాయణ, సర్పంచ్ యలమంచిలి రఘురామ్, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, కూటమి నాయకులు బొప్పన ప్రసాద్, వరహాలబాబు, రైతులు పాల్గొన్నారు.



నాతవరం: జిల్లేడిపూడి సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ... రోలుగుంట: కొమరవోలు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమ్మ

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ కోరారు. బూరుగుపాలెం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూరుగుపాలెం రెవెన్యూ పరిధిలో భూముల ఆన్‌లైన్ సమస్యలను సదస్సులు ద్వారా పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం రూరల్: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో సోమవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా డీటీ రవీంద్రబాబు సూచించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ సత్యనారాయణ, సర్పంచ్ గజాల నాగరత్నం, వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం, జనసేన నాయకుడు ఊడి చక్రవర్తి, రెల్లి సంఘ నేత పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగమ్మ సూచించారు. మండలంలోని కొమరవోలు గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఎప్పటి నుంచో పరిష్కారం కాని భూ సమస్యలపై రైతులు అర్జీలను అందించాలని సూచించారు. అనంతరం పలువురు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో రాజులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అదానీ అవినీతిపై సీబీఐ విచారణ చేపట్టాలి

సీపీఐ నాయకుల డిమాండ్.. మండలాల్లో ఆందోళన కార్యక్రమాలు

నర్సీపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అదానీ విద్యుత్ ఒప్పందాలు, అవినీతి కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా సోమవారం ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేసి చార్జీల భారం తగ్గించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, జి.గురుబాబు, ఎల్‌వీ.రమణ, జి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో...

చోడవరం: అదానీతో వైసీపీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ కార్యకర్తలు చోడవరంలోని సూపర్‌బజారు వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ అమెరికాలో అదానీపై అవినీతి కేసు నమోదు కావడంతో పాటు ముడుపులు వ్యవహారం బయటకు రావడంతో ఈ ఒప్పందాల వెనుక భారీ అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ఈ ఒప్పందాలను సమీక్షించి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మణిపూర్‌లో హింసాత్మక ఘటనలపై పార్లమెంటలో చర్చ జరపాలని, సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించుకోవాలేని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్యనారాయణ, బొబ్బిలి శంకరరావు, ముడిసి తాతబాబు, ప్రసాదుల సాయి, డోక్లా శివగణేశ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కనకదుర్గమ్మ ప్రచార రథం ఊరేగింపు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామానికి విజయవాడ కనకదుర్గమ్మ రథం సోమవారం వచ్చింది. నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు భక్తులు అమ్మవారి రథాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఏఎల్‌పురం కనకదుర్గమ్మ ఆలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కృష్ణాదేవిపేట పోలీసు స్టేషన్ వరకు రథాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.తారకేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు చిటికెల తారకవేణుగోపాల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కనకదుర్గమ్మ ప్రచార రథానికి పూజలు చేస్తున్న భక్తులు

లేగ దూడల పెంపకంలో జర జాగ్రత్త

దేవరాపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) లేగ దూడల పెంపకంలో జాగ్రత్తలు వహిస్తే అన్ని విధాలా మేలు చేకూరుతుందని పశు గణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసాదరావు చెప్పారు. నాగయ్యపేట శివారు సీతంపేటలో సోమవారం ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శనలో 60 పెయ్యలను ఉంచారు. ఇందులో ప్రథమ బహుమతి లక్ష్మి గేదెపెయ్య, రెండో బహుమతి ముత్యాలుకు చెందిన పెయ్య, మూడో బహుమతికి గోవింద జెర్సీ పెయ్యలను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. పెయ్యల యాజమాన్య పద్ధతులపై ఈవో ప్రసాదరావు అవగాహన కల్పించారు. ఏడీ దినేశ్‌కుమార్, కేహెచ్‌పీ మంజుషారాణి, పశు వైద్యులు జి.ప్రియాంక, సురేష, అప్పారావు, త్రినాథ్ పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న ఈవో ప్రసాదరావు

యోగా ధ్యాన దినోత్సవానికి ఐరాస ఆమోదం ఆనందకరం

చోడవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ప్రపంచ యోగా ధ్యాన దినోత్సవానికి ఐక్యరాజ్య సమితి ఆమోదం లభించడం ఆనందకరమని ఏపీ స్టేట్ యోగా అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పుల్లేటి సతీశ్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ధ్యాన దినోత్సవం ఏటా డిసెంబరు 21న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునేలా భారత్, శ్రీలంక, నేపాల్, మెక్సికో వంటి దేశాలు ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి ఆమోదించడం హర్షనీయమన్నారు. ఇది యోగాకు దక్కిన గౌరవమని, మన రాష్ట్రంలోనూ పాఠశాల స్థాయి నుంచి యోగాను అనుసరించేలా ప్రభుత్వాలు మార్గదర్శకాలు రూపొందించి అమలు చేస్తే యువతకు ఎంతో మేలు చేకూరుతుందని సతీష్ సూచించారు.

కొత్తకోటలో డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని నిరసన

రావికమతం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మూడు మండలాలకు ముఖ్య కూడలిగా ఉన్న కొత్తకోటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. కల్యాణపులోవలో గిరిజన విద్యార్థులతో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. కొత్తకోటలో డిగ్రీ కాలేజీ లేక రావికమతం, రోలుగుంట, మాడుగుల మండలాల పరిధిలోని అనేక గ్రామాల విద్యార్థులు డిగ్రీ చదువులకు నోచుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సీపట్నం, చోడవరం వెళ్లడం బాలికలకు ఇబ్బందిగా మారడంతో ఇంటర్‌తోనే చదువుకు స్వస్తి చెబుతున్నారని వాపోయారు. ఈ సమస్యలను ప్రభుత్వం గుర్తించి కొత్తకోటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి

మాడుగుల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో ఈ నెల 20 నుంచి జరగనున్న సీపీఎం జిల్లా మహాజన సభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి కోరారు. అనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధి, షుగర్ ఫ్యాక్టరీల పునః ప్రారంభం, గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చడం తదితర విషయాలపై సభల్లో చర్చించనున్నట్టు చెప్పారు. అతని వెంట సీపీఎం నేత కార్లి భవానీ ఉన్నారు.

19 మద్యం సీసాలు స్వాధీనం

చీడికాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరహాపురం గ్రామంలో మద్యం బెల్టు దుకాణం నిర్వహిస్తున్న పెచ్చేటి అప్పలనాయుడుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీశ్ సోమవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆదివారం సిబ్బందితో కలిసి దాడులు చేయగా 19 మద్యం సీసాలు లభ్యమయ్యాయని చెప్పారు. వీటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

నాటుసారాతో ఒకరి అరెస్టు

దేవరాపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్సింగి గ్రామం నుంచి నాలుగు లీటర్ల నాటుసారా తరలిస్తుండగా ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. చోడవరం ఎక్సైజ్ సీఐ పాపునాయుడు, ఎస్ఐ హనుమంతు సారా తరలిస్తున్న వ్యక్తి పట్టుకొని అరెస్టు చేసినట్టు చెప్పారు.

ఈవీఎంల వేర్‌హౌస్ తనిఖీ

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలన



ఈవీఎంల బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల(ఈవీఎం) వేర్‌హౌస్‌ను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం నియోజకవర్గాలకు సంబంధించిన అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు చెందిన ఈవీఎంలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని భవనాల్లో భద్రపరిచారు. సీళ్లు వేసిన వాటి తాళాలను తెరిచి ఈవీఎంలు భద్రపరిచిన బాక్స్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఈవీఎంల వేర్‌హౌస్ తనిఖీలు చేపడుతున్నామన్నారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధుల సమక్షంలోనే ఈ తనిఖీలు చేశామని, అక్కడ భద్రతా చర్యలపై సైతం రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి చెందారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, తహసీల్దార్ వి.త్రినాధరావునాయుడు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాఫీ ఏడీ అశోక్ సేవలు ఆదర్శనీయం

▸▸ నివాళులర్పించిన ఐటీడీఏ పీవో వి.అభిషేక్



అశోక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, తదితరులు

పాడేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కాఫీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ దివంగత ఎన్.అశోక్ సేవలు ఆదర్శనీయమని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సంతాపసభలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో కాఫీ తోటల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతూ, వివాదరహిత అధికారిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ప్రతి గిరిజన కాఫీ రైతుతో స్నేహపూర్వకంగా ఉండేవారని, ఏ పని అప్పగించినా కాదనకుండా చేసేవారన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా ఆయన్నే లైజన్ అధికారిగా నియమించేవారమని గుర్తు చేశారు. అంతకుముందు ఐటీడీఏ పీవో అభిషేక్, ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఏవో ఎం.హేమలత, తదితరులు అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి'



గర్భిణులకు సూచనలు ఇస్తున్న సూపరింటెండెంట్ పద్మావతి

చింతపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని స్త్రీ వైద్యనిపుణులు అనీష అన్నారు. సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 200 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేశారు. ఈ సందర్భంగా స్త్రీ వైద్యనిపుణులు ప్రమాదకర ప్రసవాలు కలిగిన గర్భిణులను గుర్తించి అప్రమత్తంచేశారు. గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవం పొందడం సురక్షితమని, పురిటినొప్పులు ప్రారంభమైన తరువాత ఆస్పత్రికి తరలించడం కంటే గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందుగా చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలి

▸▸ వైద్యాధికారి హిమబిందు



గర్భిణులకు పరీక్షిస్తున్న వైద్యాధికారి హిమబిందు

సీలేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు విధిగా ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలని ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. సోమవారం ధారకొండ పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆసుపత్రిలో ప్రసవం పొందడం సురక్షితమన్నారు. ప్రసవం సమయానికి 10 రోజులు ముందుగా ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. గర్భం దాల్చిన తర్వాత తొమ్మిది నెలల్లో ఒక్కసారి అయినా అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించుకోవాలని హిమబిందు గర్భిణులకు సూచించారు.

ఎంఎస్ఎంఈ సర్వేలు పూర్తిచేయండి

▸▸ ఎంపీడీవో ఏవీవీ.కుమార్



కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న ఎంపీడీవో

అనంతగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ సర్వేలో వెనుకబడి ఉన్నామని, నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని సోమవారం సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లతో ఎంపీడీవో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు) వ్యాపార దుకాణాలకు సంబంధించి సర్వేలో వెనుకబడి ఉన్నామని, రెండు రోజుల్లో పూర్తిచేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు సంబంధించి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐ లింకు చేయించాలని, దీనిపై అవగాహన కల్పించి రెండు రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. లేనిపక్షంలోని చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రోడ్ల పనులు త్వరగా చేపట్టాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కమిటీలో ఆమోదించిన రోడ్ల పనులను త్వరగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గిరిజన సంక్షేమ శాఖ, రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ ఆంక్షలున్న రోడ్డు పనులకు సంబంధించి అటవీ, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు సంయుక్తంగా పరిశీలన జరిపి నిర్మాణ పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతులకు పంపించాలని సూచించారు. అలాగే అటవీ శాఖాధికారులు జాప్యం చేయకుండా అనుమతులు జారీచేయాలన్నారు. అలాగే మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మించే క్రమంలో గ్రామసభ తీర్మానం చేయడంతోపాటు భవిష్యత్తులో పోడు వ్యవసాయం చేయబోమని గ్రామస్థుల ఆమోదం తీసుకోవాలన్నారు. అరకులోయ మండలం మాడగడ నుంచి అరకురోడ్డుకు, డుంబ్రిగుడ మండలం గుల్లి నుంచి డబ్బగరువు రోడ్డుకు అటవీ, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు సంయుక్తంగా సర్వే చేయాలన్నారు. అలాగే జోలగుడ నుంచి డుంబ్రిగుడ రోడ్డుకు, లోతేరు నుంచి, చెల్లుబడి, కటికి వాటర్ పాల్స్, తారాబు వాటర్‌పాల్స్ కర్రిగుడ, చినకోవెల రోడ్లను ఆమోదించామన్నారు. అలాగే అవసరమైన మేరకు సెల్ టవర్ల నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తామని కలెక్టర్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు కె.వేణుగోపాల్, జి.డేవిడ్‌రాజు, సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి, వర్చువల్‌గా రంపచోడవరం ఐటీడీఏ పీవో కె.సింహాచలం, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ కొండయ్య పడాల్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ల సామగ్రి చోరీపై పోలీసులకు ఫిర్యాదు

▸▸ పక్కా ఆధారాలు సేకరించిన విజిలెన్స్ అధికారులు

▸▸ ఈపీడీసీఎల్ అధికారుల వెల్లడి



టంగళ్లగొందిలో బ్యాటరీలను దొంగలు దోచుకున్న సోలార్ ప్యానల్

చింతపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్‌లో ఈపీడీసీఎల్ సోలార్ ప్లాంట్(డీడీజీ ప్లాంట్) సామగ్రి అపహరణపై ఈపీడీసీఎల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడిన దోషుల కోసం విజిలెన్స్ ఎస్పీ కింజరాపు వెంకట రామకృష్ణప్రసాద్ పర్యవేక్షణలో 20 రోజులుగా విచారణ చేపట్టిన అధికారులు పక్కా ఆధారాలతో రెండు రోజుల క్రితం సీలేరు, జీకేవీధి, చింతపల్లి, అన్నవరం పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. వివరాల్లోకి వెళితే..

చింతపల్లి, జీకేవీధి మండలాల్లో గత టీడీపీ ప్రభుత్వం 2015 నుంచి 2017 వరకు విడతల వారీగా శివారు గిరిజన గ్రామాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్ (డీడీజీ ప్లాంట్)లను ఏర్పాటుచేసింది. ఈ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ల ద్వారా గిరిజనులకు విద్యుత్ సరఫరా చేశారు. ఒక్కొక్క విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రూ.25 నుంచి 50 లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేసింది. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో 96 ప్లాంట్లు ఏర్పాటు చేసింది. అయితే 2020 నుంచి సోలార్ విద్యుత్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసిన గిరిజన గ్రామాలకు ఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి గ్రిడ్ విద్యుత్ సరఫరా చేశారు. గ్రిడ్ విద్యుత్ అందుబాటులోకి రావడంతో గ్రామాల్లో సోలార్ ప్లాంట్లు వినియోగం నిలిచిపోయింది. ఇదే అదనుగా భావించిన కొంతమంది దొంగలు ఈపీడీసీఎల్ ఉద్యోగులమని చెప్పుకుంటూ సోలార్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసి బ్యాటరీలు, సోలార్ ప్లేట్లు దొంగిలించి మైదాన ప్రాంతాలకు తరలించి విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారు. జీకేవీధి మండలంలో 76 డీడీజీ ప్లాంట్లుకుగానూ 70 ప్లాంట్లు, చింతపల్లి మండలంలో 20ప్లాంట్లుగానూ 14 ప్లాంట్లలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్లు, బ్యాటరీలను కొంతమంది వ్యక్తులు అపహరించి బ్లాక్ మార్కెట్లో విక్రయించి రూ.లక్షల నగదును దోచుకున్నారు. ఈ విషయమై కూటమి నాయకులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు విచారణ ప్రారంభించారు. క్షేత్ర స్థాయిలో సోలార్ విద్యుత్ సామగ్రిని ఎవరు అపహరించారనే పక్కా సమాచారాన్ని సేకరించారు. సోలార్ సామగ్రి అక్రమాల్లో జీకేవీధి మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కొంతమంది పాత్రికేయులు ఉన్నట్టు ప్రాథమికంగా విజిలెన్సు అధికారులు గుర్తించి నట్టు తెలుస్తున్నది. విజిలెన్స్ అధికారులు సేకరించిన పక్కా సమాచారంతో సోలార్ సామగ్రి అపహరించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జీకేవీధి, సీలేరు, చింతపల్లి, అన్నవరం పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశామని స్థానిక ఈపీడీసీఎల్ డీఈఈ కె.శాని రాంబాబు, ఏఈఈ వనుము ప్రభాకరరావు సోమవారం విలేకరులకు తెలిపారు.

విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఐటీడీఏ వద్ద ధర్నా



ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్)జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం పాడేరులో భారీ ర్యాలీ చేపట్టి ఐటీడీఏను ముట్టడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నాసర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని, ప్రతీ గిరిజన వసతిగృహంలో హెల్త్ వలంటీర్లను నియమించాలని, గిరిజన విద్యార్థుల మరణాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. కళాశాలల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్‌మెంట్ విడుదల చేయకపోవడంతో చాలా మంది విద్యార్థులు విద్యకు దూరమై కూలీలుగా జీవనం గుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గిరిజన సంక్షేమ ఆశ్రమాలలో, కళాశాలల వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఫణీంద్ర, మస్తాన్, కృష్ణ, అభిరామ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మద్దతు

జిల్లాలోని గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను సీఆర్టీలుగా మార్పు చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నాసర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలు సోమవారానికి 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు శిబిరాన్ని సందర్శించి, దీక్షలు చేస్తున్న ఉద్యోగులకు మద్దతు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ కేన్సర్ పరీక్షలు నిర్వహించాలి : డీఎంహెచ్‌వో



సీలేరు పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

సీలేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ తప్పనిసరిగా కేన్సర్ పరీక్షలను నిర్వహించాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా ఆదేశించారు. సోమవారం సీలేరు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమావేశమై పీహెచ్‌సీ పరిధిలో క్షేత్రస్థాయిలో ఉచితంగా కేన్సర్ పరీక్షలను నిర్వహించి, వారికి కేన్సర్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రీయ బాలల ఆరోగ్య రక్షలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిబద్ధతతో ఆరోగ్య పరీక్షలను నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వార్డు, క్లీనిక్, లేబ్, ఫార్మసీ, పనితీరును, ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి ఎస్‌కె మస్తాన్ వలీ, ఆరోగ్య విస్తరణాధికారి జోజిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ ఎన్.త్రినాథరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

▸▸ పీసీసీ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి



ఉద్యోగుల దీక్షలకు మద్దతు తెలిపిన శాంతకుమారి, పార్టీ నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకుల న్యాయమైన డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి డిమాండ్ చేశారు. 24 రోజులుగా ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా నిరాహార దీక్షలు చేస్తున్న గురుకుల ఉద్యోగుల శిబిరాన్ని ఆమె సోమవారం సందర్శించి, శిబిరంలో పార్టీ నాయకులతో కూర్చొని ఉద్యోగుల దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలల ప్రిన్సిపాళ్ల ఆందోళన చేస్తున్న వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. తక్షణమే నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ అందించిన షోకాజ్ నోటీసులను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఐటీడీఏ వద్ద దహనం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మొస్య ప్రేమ్‌కుమార్, పాచిపెంట చిన్నస్వామి, గొల్లోరి పద్మ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

అనంతగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువశోభ పంచాయతీ 'కొత్తవలసలో పరాయి పంచన అంగన్‌వాడీ కేంద్రం' అనే శీర్షికన ఈ నెల 5వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి జిల్లా ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. దీనిపై వివరణ చేయాలని స్థానిక సీడీపీవో సంతోషికుమారికి ఆదేశించారు. (ఐఏపీ) నిధులు ఆగిపోవడంతో కొత్తవలస భవనం అసంపూర్తిగా నిలిచిపోయిందని, దీనిపై ఇతర స్కీమ్‌లోని మరలా ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే భవనం పనులు పూర్తిచేసేలా చర్యలు చేపడతామని తెలిపారు.

అందుబాటులో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

అనంతగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పన్నెండేళ్లుగా 2జీ సేవలకు పరిమితమై అంతంతమాత్రంగా నెటవర్క్ సేవలు ఉండేవి. సోమవారం నుంచి 4జీ సేవలు అందుబాటులోకి రావడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు. అయితే టవర్ ఏర్పాటు నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోతే, సిగ్నల్స్‌కు అంతరాయం ఏర్పడుతుందని, దీనిపై బీఎస్ఎన్ఎల్ అధికారులు దృష్టిసారించాలని సూచించారు. డముకు, కాశీపట్నంలో సేవలను పునరుద్ధరించాలని, శాటిలైట్ సిగ్నల్స్ కావడంతో నెటవర్క్ సక్రమంగా అందకపోవడం వినియోగదారులు అవస్థలు పడుతున్నారని చెప్పారు.

అపరిత ఆశ్రయం కల్పించొద్దు: ఎస్‌ఐ రామక్రిష్ణ

ముంచంగిపుట్టు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని ఎస్‌ఐ జె.రామక్రిష్ణ కోరారు. పలు గ్రామాల్లో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు రాత్రి గస్తీ నిర్వహిస్తున్నారు. సోమవారం ఎస్‌ఐ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఎవరిపై అనుమానం వచ్చినా తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు చేపట్టాలి



లాగబూసిలో నినాదాలు చేస్తున్న గిరిజనులు, నాయకులు

పెదబయలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపేట, అడుగులపుట్టు పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై తగిన చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం నాయకుడు సన్నిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రెండు గ్రామాల గిరిజనులతో వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. రెండు పంచాయతీల్లో సుమారు రూ.25 లక్షల నిధులను కార్యదర్శులతో కుమ్మక్కై సర్పంచులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. దీనిపై మీ కోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. లక్ష్మీపేట సర్పంచులు అశోక్, అడుగులపుట్టు సర్పంచ్ కొర్ర వరలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి మున్నూరు రాంప్రసాద్‌లతో చేయి కలిపి పనులు జరగకుండానే వివిధ రకాల పనుల పేరుతో నిధులను డ్రా చేసి సొంతానికే వాడుకున్నారని ఆరోపించారు. ఎవరెవరి పేరుతో ఎంతెంత ఎప్పుడెప్పుడు డ్రా చేశారనే వివరాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేత సునీల్ కుమార్, గిరిజన సంఘం నేత ధర్మన్నపడాల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పావురాన్ని కాపాడిన విద్యుత్ సిబ్బంది



తీగల్లో చిక్కుకున్న పావురాన్ని తీస్తున్న కూర్మారావు

సీలేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో సోమవారం కల్వరి చర్చి వద్ద గల విద్యుత్ తీగలపై ఒక పావురం చిక్కుకుపోయింది. దీంతో ఆ పావురం ఎంత సేపటికీ అక్కడ నుంచి వెళ్లకపోవడంతో ఇది గమనించిన స్థానికులు విద్యుత్ శాఖ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారమిచ్చారు. దీంతో కాంట్రాక్టు కార్మికుడు కూర్మారావు స్పందించి విద్యుత్ లైన్ ఆపి తీగల్లో ఇరుక్కుపోయిన పావురాన్ని తీసి ప్రాణాలను కాపాడారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కూర్మారావును అభినందించారు.

చింతపల్లిలో తుఫాన్ పునరావాస కేంద్రం

చింతపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తుఫాన్ పునరావాస కేంద్రం ఏర్పాటు చేసేందుకు 10 సెంట్ల స్థలం కేటాయించినట్టు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. చింతపల్లి తుఫాన్ పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈమేరకు చింతపల్లి యువత శిక్షణ కేంద్ర సమీపంలోనున్న స్థలాన్ని కేటాయించామన్నారు. అలాగే ఈనెల 13 నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులో భూవివాదాలను పరిష్కరిస్తామన్నారు.

మద్యం ధరలు తగ్గింపు : ఎక్సైజ్ సీఐ

పాడేరురూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలను తగ్గించిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ టీవీవీఎస్ఎన్.ఆచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాన్సన్ హౌస్ బ్రాంది (750 ఎం.ఎల్) పాత ధర రూ. 870, కొత్త ధర రూ.760 కి విక్రయిస్తారని చెప్పారు. పింట్(375ఎం.ఎల్) పాత ధర రూ. 440, కొత్త ధర రూ.380లు, నిబ్(180ఎం.ఎల్) పాత ధర రూ.220, కొత్త ధర రూ.190లకు మద్యం దుకాణాలలో విక్రయిస్తారన్నారు. ప్రస్తుతం మద్యం దుకాణాల్లో పాత స్టాక్ నిల్వ ఉంటే పాత ఎంఆర్‌పీ ధరలకు విక్రయిస్తారన్నారు. కొత్త స్టాక్ వస్తే కొత్త ఎంఆర్‌పీ ధరలకు విక్రయిస్తారని తెలిపారు. కొనుగోలుదారులు గమనించాలని ఆయన సూచించారు.

ముమ్మురంగా టీడీపీ సభ్యత్వాల నమోదు



బంధవీధిలో సభ్యత్వాలు నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

జి.మాడుగుల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు తెలిపారు. సోమవారం కె.కోడాల్లి, వంతాల, సొలభం, కోరాపల్లి తదితర పంచాయతీల గ్రామాల్లో సభ్యత్వాల నమోదు చేపట్టినట్టు చెప్పారు. ప్రతీ సభ్యుడికి రూ.ఐదు లక్షల బీమా ఉంటుందని, ఆపై మట్టి ఖర్చులను గాను రూ.పది వేలు ఇస్తారన్నారు.

'సీలేరు గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో మెయింటెనెన్స్ బిల్లులు చెల్లించాలి'

సీలేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు బాలుర గురుకుల పాఠశాల, బాలికల పాఠశాలల్లో 2019లో నిర్వహించిన మరమ్మతుల బిల్లులు ఇప్పటివరకు చెల్లించకపోవడంపై కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. సోమవారం కాంట్రాక్టర్లు కె.వల్లీప్రసాద్, ఎం. సత్తిబాబు విలేకర్లతో మాట్లాడుతూ.. 2019లో సీలేరు బాలుర గురుకుల పాఠశాలలో లైట్లు, విద్యుత్ వైరింగ్, డోర్స్ రిపేర్లు, పెయింటింగ్ తదితర మరమ్మతు పనులు చేశామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన రూ.8.5 లక్షల పనులకు ఇంతవరకు బిల్లులు చెల్లించలేదన్నారు. అలాగే అదే సంవత్సరంలో సీలేరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.7.5 లక్షల అంచనాలతో చేసిన పనులకు బిల్లులు రాలేదన్నారు. అధికారులు రికార్డు చేసి పాడేరు పంపించారని, 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. తాము అప్పులు చేసి పనులు చేశామని, తమపై వడ్డీల భారం పడుతున్నదని కాంట్రాక్టర్లు వాపోయారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో తమ గోడును అర్థం చేసుకుని బిల్లులు చెల్లించి, తమ కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని కోరారు.

చింతపల్లి చేరుకున్న దుర్గమ్మ ప్రచార రథం



కనక దుర్గమల్లేశ్వరిని దర్శించుకుంటున్న భక్తులు

చింతపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గ మల్లేశ్వరి ప్రచార రథం సోమవారం చింతపల్లి చేరుకున్నది. సాయంత్రం సబ్ జైల్ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కనకదుర్గ మల్లేశ్వరి దర్శన భాగ్యం కల్పించేందుకు ఆలయం ఈవో కేఎస్ రామారావు ఈనెల 6వ తేదీన ఉత్తరాంధ్ర పర్యటనను ప్రారంభించారు. చింతపల్లి చేరుకున్న ప్రచార రథం వద్దకు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ప్రచార రథం మంగళవారం అరకులోయ చేరుకోనున్నది. ఈనెల 12వ తేదీతో ఉత్తరాంధ్ర పర్యటన ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మురళీధర శాస్త్రీ, సాయి పంతులు, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, నాయకులు బంగారయ్య శెట్టి, చిన్న, దూనబోయిన రమణ, గాజుల శ్రీను, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

13 నుంచి రెవెన్యూ సదస్సులు

తహసీల్దార్ నర్సమ్మ



ముంచంగిపుట్టు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 13వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ నర్సమ్మ తెలిపారు. సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 23 పంచాయతీల పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వీటిని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. గ్రామాల్లో నిర్వహించే సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సుల నిర్వహణకు రెండు టీమ్‌లను నియమించినట్టు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు జరుగుతాయని ఆయన తెలిపారు. సమావేశంలో ఆర్ఐలు, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

భోగలింగేశ్వర స్వామి హుండీ ఆదాయం లెక్కింపు



ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

కొత్తూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణం భోగలింగేశ్వర స్వామికి రూ.1,00,282 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. హుండీలో భక్తులు వేసిన కానుకలను కార్యనిర్వహణాధికారి బి.మురళీకృష్ణ పర్యవేక్షణలో సోమవారం లెక్కించినట్లు తెలిపారు. నిరుడు కార్తీకమాసం ఆదాయం 65,242లు రాగా, ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరగడంతో హుండీ ఆదాయం కూడా పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు మద్దాల నారాయణరావు, పెంటకోట గణేష్, మళ్ల సూరిబాబు, దేవదాయ ధర్మాదాయ శాఖ ఇనస్పెక్టర్లు బి.వసంత కుమార్, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయానికి విరాళం



విరాళం అందిస్తున్న బోకం సత్యనారాయణ

సబ్బవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సబ్బవరంలో పురాతన శివాలయం పునర్నిర్మాణానికి సబ్బవరం సాయినగర్‌కు చెందిన వ్యాపారవేత్త బోకం సత్యనారాయణ సోమవారం రూ.2.30 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నానిబాబు, ప్రకాశ్, బర్ల రమణ, కొల్లి కృష్ణ, గెడ్డం కృష్ణ, ఈశ్వరరావు, చింతల శ్రీను, పెన్నం శ్రీను తదితరులు అభినందించారు.

బాక్సింగ్‌లో బంగారు పతకం



విద్యార్థి యశ్వంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి తదితరులు

సబ్బవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెషనల్ బాక్సింగ్ లీగ్ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలో జరిగిన 54 కేజీల విభాగంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థి కె.యశ్వంత్ బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా యశ్వంత్‌ను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ అభినందించారు. విద్యార్థులు ఇలాంటి విజయాలు సాధించడం వల్ల కళాశాల ఖ్యాతి మరింత ఇనుమడిస్తుందన్నారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో యశ్వంత్ రాణించి మరింత ఉన్నతికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లెక్కల గణేష్, అధ్యాపకులు ఎంవీ రామకృష్ణ, గణేష్ తదితరులు అభినందించారు.

షుగర్ ఫ్యాక్టరీ ఆస్తుల పరిరక్షణకు వినతి

తుమ్మపాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ ఆస్తుల పరిరక్షణకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని షుగర్స్ షేర్ హోల్డర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గొర్లి మోదినాయుడు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విలువైన ఫ్యాక్టరీ స్థలాలు దురాక్రమణకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. ఫ్యాక్టరీలో విలువైన యంత్ర పరికరాలు మాయమవుతున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఇన్‌చార్జి ఎండీ సైతం వీటి పరిరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆస్తులు కళ్ల ముందే హరించిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల వేతన బకాయిలు చెల్లించకుండా నిధులను పక్కదోవ పట్టించారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీలో జరుగుతున్న అక్రమాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

వెదురుపర్తి పాఠశాలలో నాటిక ప్రదర్శన



రామానుజన్ చరిత్రను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కశింకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెదురుపర్తి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జాతీయ గణిత వారోత్సవాల్లో భాగంగా మేధావి శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రపై సోమవారం నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జి.వి.కె.ఆచారి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా ప్రదర్శించారని కితాబిచ్చారు. రామానుజన్ జీవిత చరిత్రను గణిత ఉపాధ్యాయుడు ఎ.వి.ఎన్.మూర్తి స్కిట్ రూపంలో ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వి.ఎస్.సత్యనారాయణ మూర్తి, బోయిన చిన్నారావు, విజయ్, సబిత లక్ష్మి, సోమరాజు, విజయలక్ష్మి, త్రివేణి పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులను గౌరవించండి

» ప్రోటోకాల్ పాటించడం తప్పనిసరి » సమీక్షా సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే పంచకర్ల ఆదేశం





ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులను గౌరవించడంతో పాటు ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయ పరుచుకోవాలన్నారు. అభివృద్ధిలో రాజీ పడవద్దన్నారు. ముఖ్యంగా ప్రోటోకాల్ పాటించడం మరిచిపోవద్దన్నారు. శాఖల వారీగా సమీక్ష చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు ఉన్నాయో, లేవో ఎంఈవోలు చూసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో బోధన జరగాలన్నారు. పాఠశాలల్లో పరిష్కరించాల్సిన సమస్యలను ఎంఈవో సాయిశైలజ వివరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అవసరమైన మందులు, రక్త పరీక్ష పరికరాలు, ఆపరేషన్ థియేటర్, జనరేటర్, ఎక్సరే సదుపాయాలపై వైద్యాధికారులు అప్పారావు, జయశ్రీ కరిష్మలను ప్రశ్నించగా సమాధానం చెప్పలేక పోయారు. ఆస్పత్రికి ఏమి కావాలో తెలుసుకోవాల్సిన బాధ్యత వైద్యులపైన ఉందని ఎమ్మెల్యే అన్నారు. విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఆయన పేర్కొన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకుల నుంచి 35 శాతం రాయితీతో రుణాలను అందిస్తుందని, వీటి విషయం ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వెలుగు, పశువైద్య శాఖ అధికారులపై ఉందన్నారు. మద్యం దుకాణాల యజమానులు నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా.. అన్న విషయాలను గమనించడంతో పాటు అతిక్రమించేవారిపై చర్య తీసుకోవాల్సిన బాధ్యత పోలీస్, ఎక్సైజ్ అధికారులపై ఉందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, సోషల్ వెల్ఫేర్, పంచాయతీరాజ్ తదితర శాఖలు చేపడుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీక్షకు హాజరు కాని వ్యవసాయ మార్కెటింగ్, కార్మిక శాఖ, గనుల శాఖల అధికారులపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఎంపీడీవో ఎస్‌డీ. శ్యామ్‌సుందర్, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అత్త పాత్రల్లో ఆమెకు సాటి లేరెవ్వరు

» సూర్యకాంతం నటనను గుర్తు చేసుకున్న మాజీ మంత్రి 'దాడి' » అనకాపల్లిలో శత జయంతి ఉత్సవాలు



సూర్యకాంతం కుమారుడు డాక్టర్ అనంత పద్మనాభమూర్తిని సన్మానిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



కార్యక్రమానికి హాజరైన అభిమానులు

కొత్తూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సినీనటి సూర్యకాంతం జన్మించి 100 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా ఆదివారం రాత్రి అనకాపల్లి రోటరీ కల్యాణ మండపంలో అనకాపల్లి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ, సూర్యకాంతం ఎక్కువ సినిమాల్లో 'అత్త' పాత్రను పోషించారని, ఆ పాత్రలకు ఆమె తప్ప మరొకరు న్యాయం చేయలేరన్నట్టు సహజసిద్ధంగా నటించారని కొనియాడారు. తమ సంస్థ డైమండ్ హిట్స్ తరపున ఆమెను ఘనంగా సన్మానించిట్టు గుర్తు చేశారు. ఉపాధ్యాయ ఉద్యమనేత వేణు మాస్టారు మాట్లాడుతూ, తెలుగు సినిమా పరిశ్రమలో సూర్యకాంతం లేని లోటును మరొకరు పూడ్చలేరని అన్నారు. విశాఖ ఫిలిం సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, తెలుగు వారు ఉన్నంత వరకు సూర్యకాంతం నట వెలుగుల అస్తమించవని అన్నారు. అనకాపల్లి ఫిలిం సొసైటీ కార్యదర్శి పి.ఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ, కవిత్వంలో శ్రీశ్రీ, వచన రచనలో రా.వి. శాస్త్రి, నటనలో సూర్యకాంతంలది ప్రత్యేకమైన బాణీ అని, వారిని అనుకరించడం అసాధ్యమని అన్నారు. కర్రి దివాకర్ మాట్లాడుతూ, సూర్యకాంతం పలు సినిమాల్లో నెగెటివ్ పాత్రలు పోషించినప్పటికీ సినిమా విజయవంతం కావడానికి ఆ ప్రాతలు ప్రధాన భూమిక పోషించాయని అన్నారు. 500 పేజీలతో రూపొందించిన సూర్యకాంతం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి సూర్యకాంతం కుమారుడు డాక్టర్ అనంత పద్మనాభమూర్తి, కోడలు, మనుమడు, మనుమరాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మనాభమూర్తిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఫిలిం సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి తమ్మన సుబ్బారావు, కోశాధికారి శ్రీధరాల సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలలకు రేటింగ్ ఇవ్వడం అన్యాయం'



పట్టణ బాలికల హైస్కూలులో ప్రచారం చేస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ తదితరులు

కొత్తూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా, ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయకుండా బోధనేతర పనులు అప్పగిస్తూనే రేటింగ్ ఇవ్వడం అన్యాయమని ఉత్తరాంధ్ర పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ విమర్శించారు. సోమవారం ఆమె అనకాపల్లి పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులను కలిసి తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. అనంతరం పలు పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా పాఠశాలలకు పక్కా భవనాలు, మరుగుదొడ్లు లేవని అన్నారు. ప్రభుత్వమే పాఠశాలల గౌరవాన్ని దిగజార్చడం సరికాదన్నారు. మామిడిపాలెం జడ్పీ హైస్కూలులో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం తుమ్మపాల, గవరపాలెం, గాంధీనగరం, టౌన్ బాలికలు, మున్సిపల్ పెద్ద హైస్కూళ్ళను సందర్శించి ఉపాధ్యాయుల మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, ఉపాధ్యక్షుడు గొంగలి అక్కునాయుడు, కార్యదర్శి మాకిరెడ్డి రాజునాయుడు, అనకాపల్లి మండల శాఖ అధ్యక్షుడు మామిడి బాబూరావు, ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోకు అస్వస్థత

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఏవోగా విధులు నిర్వహిస్తున్న బీవీ రాణి సోమవారం అస్వస్థతకు గురై కలెక్టరేట్ సమావేశ మందిరంలో కుప్పకూలారు. ఈమె పీజీఆర్ఎస్‌లో పాల్గొని విధులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయాన్ని గ్రహించిన కలెక్టరేట్ సిబ్బంది ఆమెను హుటాహుటిన వీల్‌చైర్ సాయంతో కలెక్టరేట్ వెలుపల నుంచి తీసుకొచ్చి ప్రైవేటు వాహనంలో చికిత్స కోసం తరలించారు. పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యశాలలో చేర్పించి చికిత్స అందజేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు.



అస్వస్థతకు గురైన బీవీ రాణిని వీల్‌చైర్‌పై తరలిస్తున్న ఉద్యోగులు

నేడు కన్యకాపరమేశ్వరి అమ్మవారి వెండి రథం ప్రారంభం



కొత్తూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి రథం మంగళవారం ప్రారంభం కానుందని ప్రాజెక్టు చైర్మన్ ఆరేపు కామేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.కోటి పది లక్షలతో తయారు చేసిన ఈ రథం ప్రారంభ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాజన సభ గౌరవ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం కన్యకాపరమేశ్వరి అమ్మవారిని పట్టణ వీధుల్లో ఊరేగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్న రామ సత్యనారాయణ, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, గణేష్ రాయిపూడి, ఇల్లూరి లక్ష్మయ్య, గ్రంధి శ్రీనివాసరావు పాల్గొంటారని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మన మాతృభాష.. భావితరాలకు ఆస్తి



'ఏదురులేని ఏడు' నవలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కొత్తూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి గవరపాలెంలో ఉన్న షిరిడిసాయి న్యాయ కళాశాలలో "ఎదురు లేని ఏడు" నవల ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. తెలుగు భాష పరిరక్షణ సమితి నూరో కార్యక్రమంలో రామ్మోహన్ రచించిన నవలను ప్రముఖ కథా రచయిత్రి కలవల గిరిజారాణి ఆవిష్కరించారు. అనంతరం సమితి సమన్వయకర్త కొయిలాడ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోని 20 పరిసర ప్రాంతాల్లో 99 కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ రెండేళ్లలో మాతృభాషా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలు ఘనంగా నిర్వహించి మహాభారతం, రామాయణంపై పెద్దఎత్తున పోటీలు నిర్వహించామన్నారు. ప్రముఖ దంత వైద్యుడు శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ముందు తరాలవారికి మనం అందించగల ఆస్తి భాష మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కథా రచయిత జి.రంగబాబు, అమరజ్యోతి, లక్ష్మీ గాయత్రి, శిష్టా తమ్మిరాజు, మాధవీసనారా, కర్రి మల్లీశ్వరి, ఎం.జగదీష్, ఎం. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ సంస్థలకు బీజేపీ దన్ను'



నెహ్రూచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

తుమ్మపాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కంపెనీలకు బీజేపీ ప్రభుత్వం కొమ్ము కాస్తూ కోట్లాది రూపాయలు దోచిపెడుతోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పాలనలో వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సోమవారం నెహ్రూ చౌక్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ అవినీతిని మోదీ ప్రభుత్వం సమర్థిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్య, విద్యుత్ చార్జీల పెంపు, అధిక ధరల మోత, తదితర అంశాలపై దృష్టి సారించాల్సిన బీజేపీ ప్రభుత్వం, వాటిని పక్కనపెట్టి కేవలం కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చుతోందని ఆరోపించారు. తక్షణమే దేశంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎస్. భద్రం, నాయకులు సన్యాసిరావు, నాగరాజు, శంకరరావు, చిన్ని, వీరాచారి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

» భూ సమస్యలపై గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు అర్జీల వెల్లువ » గ్రామాల్లో సదస్సులకు స్పందన



భరణికం గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



కొండకొప్పాకలో ప్రసంగిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర



చింతలపాలెంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



అర్జీ స్వీకరిస్తున్న డీటీ అప్పారావు

పరవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై ప్రజలు, రైతుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు అర్జీలు అందించారు. అపరిష్కృత సమస్యలకు పరిష్కారం చూపాలని అభ్యర్థించారు.

గ్రామాల్లో రెవెన్యూ సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని భరిణికంలో సోమవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్య అయినా ఈ సదస్సు ద్వారా పరిష్కరించుకొనే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతులు తమ సమస్యలను దరఖాస్తు ద్వారా రెవెన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం 45 రోజుల్లోగా సమస్య పరిష్కారమవుతుందన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్, సర్పంచ్ పెదిశెట్టి పూజ, స్థానిక నాయకులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు మంచి అవకాశం: సురేంద్ర

అనకాపల్లి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకోవాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర సూచించారు. మండలంలోని కొండకొప్పాక సచివాలయంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోరుతూ అధికారుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకూడదని ప్రభుత్వం భావించి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తోందని, ఇది ఒక మంచి అవకాశంగా భావించి పరిష్కరించుకోవాలని సూచించారు. అధికారులే ఈ సదస్సులలో పాల్గొని ఇబ్బందులు తొలగిస్తారన్నారు. జనవరి 8 వరకు జరిగే ఈ సదస్సులలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాధంశెట్టి చినతల్లి, మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కశింకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎ. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని చింతలపాలెం, గొబ్బూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూముల సర్వే నిర్వహించుకొని హెచ్చు తగ్గులను సరి చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు తప్పుగా నమోదు అయినవన్నీ సరి చేసుకునేందుకు గ్రామసభల్లో ఫిర్యాదు చేసుకోవాలని కోరారు. రీ సర్వే కాకుండా ఉన్న భూములకు, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేసిన 20 రోజుల్లో ఆయా భూ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సభల్లో మొత్తం 9 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ భాస్కరరావు, మండల సర్వేయర్ రామారావు, విఆర్‌వో పి. నాయుడుబాబు, కూటమి నేతలు మళ్ళ బాబు, ఎంఎస్ రావు, పి. అప్పారావు, ప్రకాష్, పి. శ్రీను, కర్రి దుర్గునాయుడు, అప్పలకొండ, నూకునాయుడు, తాతీలునాయుడు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

సబ్బవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ అప్పారావు కోరారు. మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో సోమవారం ప్రారంభమైన రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యన్నపాలెంలో 532 ఖాతాలు ఉండగా 1,053 ఎకరాల భూమి ఉందన్నారు. అందులో జిరాయితీ 416.12 ఎకరాలు, ప్రభుత్వ భూమి 637.84 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. సదస్సుకు 10 అర్జీలు వచ్చాయన్నారు. అందులో 6 ఆన్‌లైన్ సబ్‌డివిజన్, 4 మ్యుటేషన్ కోసం వచ్చాయన్నారు. గత రెవెన్యూ సదస్సులో 141 దరఖాస్తులు రాగా 43 పరిష్కరించామనీ, మిగిలినవి పరిష్కరించాల్సి ఉందన్నారు. క్యాక్రమంలో సర్పంచ్ బుదిరెడ్ల శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ బుదిరెడ్ల కనకరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, ఆర్ఐ వీరయ్య, సబ్‌రిజిస్ట్రార్ సీనియర్ అసిస్టెంట్ అన్నంరెడ్డి శంకర్, ఇతర శాఖల సిబ్బంది ఎం.గోవిందరావు, రాంబాబు, కామరాజు, శ్రాంకుమార్, శకుంతల, పవన్‌కుమార్, కె.శేఖర్, రైతులు పాల్గొన్నారు.

హక్కులకు కొరవడిన రక్షణ!



విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

సగటు మానవుడి ప్రశాంత జీవనానికి భరోసాను కల్పించేవి మానవ హక్కులు. ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాల్లో కుల, మత, రాజకీయపరమైన వివక్షతో ప్రజలు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో మానవులందరికీ సమాన హక్కులను కల్పించాలని భావించి, 1948లో ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధుల సభ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. దాని ప్రకారం యూఎన్‌వోలోని సభ్య దేశాలన్నీ ఈ హక్కులను అమలు చేయాల్సి ఉంటుంది.

ప్రపంచ వ్యాప్తంగా యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన

- రక్షణ, స్వేచ్ఛ కల్పించే ఉద్దేశంతో అమలు
- చట్టబండలుగానే పరిరక్షణ కమిషన్లు, ప్రభుత్వాలు
- ఇప్పటికీ కొనసాగుతున్న వివక్ష, వేధింపులు
- ఈ ఏడాది థీమ్ 'మన హక్కులు - మన భవిష్యత్'

నేడు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

ప్రపంచంలోని అనేక దేశాల్లో కక్షలు, కార్పణ్యాలు, జాతి, మత వివక్ష కారణంగా ఇబ్బందులు పడుతున్న అనేకవర్గాల ప్రజలకు ఈ హక్కులు రక్షణగా నిలుస్తాయని ఐక్యరాజ్య సమితి భావించింది. అందుకు అనుగుణంగా 1948 డిసెంబరు పదో తేదీన విశ్వ మానవ హక్కుల ప్రకటనను చేసింది. ఇవి అమల్లోకి వచ్చిన రోజునే ఏటా మానవ హక్కుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. వాటిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఏటా ప్రత్యేక థీమ్‌తో జరుపుకునే ఈ దినోత్సవాన్ని ఈ ఏడాది 'మన హక్కులు.. మన భవిష్యత్' థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

ఇవీ మానవ హక్కులు..

ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధుల సభ తీర్మానం ప్రకారం జాతి, వర్ణ, లింగ, కుల, మత రాజకీయ, తదితర కారణాలతో వివక్షకు గురికాకుండా ఉండే హక్కు, చిత్రహింసలు, క్రూరత్వం నుంచి రక్షణ పొందే హక్కు, వెట్టిచాకిరీ, బానిసత్వం నుంచి రక్షణ పొందే హక్కు, సరైన కారణం లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించకుండా ఉండే హక్కు, స్వేచ్ఛగా స్వదేశంలో, విదేశాల్లో పర్యటించే హక్కు, అభియోగం ఆపాదించిన సందర్భంలో పక్షపాత రహితంగా విచారణ పొందే హక్కు, సురక్షిత ప్రాంతాల్లో ఏకాంతంగా జీవించే హక్కు, విద్యాహక్కు, పిల్లలు ఆడుకునే హక్కు, జీవించే హక్కు, జాతీయత హక్కు, ప్రజాస్వామ్య హక్కు వంటివన్నీ మానవ హక్కుల కిందకు వస్తాయి. ఈ హక్కులకు భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, న్యాయం పొందవచ్చు.

యథేచ్ఛగా ఉల్లంఘన..

ఐక్యరాజ్య సమితిలోని సభ్య దేశాలన్నీ మానవ హక్కులను అమలుచేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. అనేక దేశాల్లో ప్రజలు జీవించే హక్కును కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. యుద్ధ వాతావరణం, ఉగ్రమూకల దాడులతో మానవాళి జీవించే హక్కును కోల్పోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఐక్యరాజ్యసమితి ఉండిపోయింది. మన దేశంలోనూ ఇటువంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత కొన్నాళ్లుగా ప్రభుత్వాలు నిరంకుశంగా వ్యవహరిస్తూ మానవ హక్కులను కాలరాస్తున్నాయనే విమర్శలున్నాయి. ప్రభుత్వాలపై వ్యాఖ్యలు చేసిన వారిపై తప్పుడు కేసులు పెట్టి, వేధింపులకు గురిచేస్తూ మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. ఇప్పటికీ అనేకచోట్ల పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలున్నాయి. వీటిపై పోరాటం చేసే పరిస్థితి కూడా లేకపోతోంది. ఇప్పటికీ ఎంతోమంది చిన్నారులు చదువుకునే అవకాశం లేక బాల కార్మికులు, వెట్టి కూలీలుగా మారిపోయారు. వీరికి ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన హక్కులు ఎలాంటి రక్షణ కల్పించడం లేదు. అనేక ప్రాంతాల్లో కుల, మత వివక్షను ఎదుర్కొంటున్నవారి సంఖ్య భారీగానే ఉంది. మానవ హక్కులుగా పేర్కొంటున్నవి చాలావరకు అమలు కాకపోవడం గమనార్హం. వీటి అమల్లో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన ప్రభుత్వాలు, కమిషన్లు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడమే ఈ పరిస్థితికి కారణమనే విమర్శలున్నాయి.



బైక్ ఢీకొని రిక్షా కార్మికుడి మృతి

రాంబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడివాడ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన రిక్షా కార్మికుడు రెల్లి సత్తిరాజు(54) మృతిచెందాడు. సీఐ నరసింగరావు తెలిపిన సమాచారం మేరకు.. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో సత్తిరాజు రోడ్డు దాటుతుండగా ఎలమంచిలి వైపు నుంచి అచ్యుతాపురం వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. ఆయన కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

ప్రైవేటు బస్సు ఢీకొని రైతు మృతి


మేడిశెట్టి నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరం సమీపంలో సోమవారం ఉదయం బస్సు ఢీకొన్న ప్రమాదంలో రైతు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి నాగేశ్వరరావు(68) సోమవారం ఉదయం సైకిల్‌పై పొలానికి వెళుతున్నాడు. కేశవరం సమీపంలో డెక్కన్ కంపెనీ నుంచి వస్తున్న బస్సు ఢీకొన్నది. తీవ్ర గాయాలైన నాగేశ్వరరావును కాకినాడ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సి.ఐ. అప్పన్న తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లెక్చరర్‌కు తీవ్రగాయాలు

రాంబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి నుంచి వెంకటాపురం వెళ్లే నేవీ రోడ్డులో ఉప్పరిగెడ్డ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలేజీ లెక్చరర్‌కు తీవ్రగాయాలయ్యాయి. లాలంకోడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన లెక్చరర్ శ్వేత విధులు ముగించుకొని సాయంత్రం మరో లెక్చరర్ శివప్రసాద్ బైక్‌పై ఇళ్లకు వెళుతున్నారు. ఉప్పరిగెడ్డ సమీపంలో వెంకటాపురం వైపు నేవీలోకి రాయిలోడుతో వస్తున్న లారీ ఢీకొన్నది. బైక్ వెనుక కూర్చుని శ్వేతకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన విషయం వాస్తవమేనని, ఇంతవరకు తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

గొడిచెర్ల వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

నక్కపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మండలంలోని గొడిచెర్ల వద్ద సోమవారం తెల్లవారుజామున విజయవాడ నుంచి పార్వతీపురం వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తా పడింది. ముందు వెళుతున్న లారీని ఢీకొన్న బస్సు.. అదుపుతప్పడంతో ప్రమాదానికి గురైంది. ఈ సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు వున్నారు. కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. చిమ్మచీకటిగా వుండడంతో ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సు డ్రైవర్ ప్రమాదం గురించి ట్రావెల్స్ యాజమాన్యానికి తెలియజేయడంతో కొద్దిసేపటి తరువాత మరో బస్సులో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. అయితే ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

13 వరకు ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విశిష్టాద్వైత మతవ్యాపకులు తిరుమంగై ఆళ్వార్ తిరు నక్షత్ర పూజలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పూజలు ఈనెల 13 వరకు జరగనుండడంతో ఆలయంలో జరిగే పలు ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఈఓ వేంద్ర త్రినాథరావు ప్రకటించారు. అలాగే ఈనెల 15న స్వామివారి ఆలయంలో వృశ్చిక దీపారాధన జరగనున్నందున ఆ రోజు రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయని చెప్పారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

- సమస్యలను పరిష్కరించడం అధికారుల బాధ్యత
- పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ జాహ్నవి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ జాహ్నవి, డీఆర్‌వో సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశతో ఎంతో దూరం నుంచి కలెక్టరేట్‌కు వచ్చి వినతులు అందిస్తుంటారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారులంతా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు అర్జీదారులతో స్వయం గా మాట్లాడి వారి సమస్యలను ఆలకించారు. అనంతరం వినతులను పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించిన ఆమె మాట్లాడుతూ, అర్జీల విషయంలో నిర్లక్ష్యం చూపవద్దని, ప్రతి అర్జీని పరిష్కరించడం ప్రభుత్వ అధికారుల బాధ్యత అని అన్నారు. కాగా పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 194 అర్జీలు అందాయి.

గడువులోగా అర్జీలను పరిష్కరించాలి: ఎస్పీ

అనకాపల్లి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖకు అందే ప్రతి అర్జీని నిర్ణీత గడువులో పరిష్కరించి, బాధితులకు భరోసా ఇవ్వాలని ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని అర్జీదారుల సమస్యలను ఆలకించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, చట్ట పరిధిలో ఉన్న అర్జీలను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, తద్వారా పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకం పెంచాలని కోరారు. కాగా పీజీఆర్ఎస్‌కు 40 వినతులు అందగా వాటిలో కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, మోసాలు తదితరాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మోహనరావు, ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రైవాడ ఆధునికీకరణ

... 5వ పేజీ తరువాయి

ఉన్న రేడియల్ గేట్ల స్థానంలో హైడ్రాలిక్ గేట్లు ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం 12 మీటర్ల వెడల్పు, నాలుగు మీటర్ల ఎత్తులో ఉన్న పది గేట్లకు బదులు 16 మీటర్ల వెడల్పు, ఏడు మీటర్ల ఎత్తుతో 11 గేట్లు ఏర్పాటు చేస్తారు.

రైవాడ రిజర్వాయర్ నుంచి విశాఖ నగరానికి రోజూ 50 క్యూసెక్కులు నీరు సరఫరా చేస్తున్నారు. ఏడాది మొత్తంగా చూసుకుంటే ఒక టీఎంసీతో సమానం. కాగా జలాశయం నిర్మించినప్పుడు దేవరాపల్లి, కె.కోటపాడు, విజయనగరం జిల్లా వేపాడ మండలాల్లో 21,500 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రణాళిక. కానీ విశాఖకు ఏడాది పొడవునా నీటిని సరఫరా చేయాల్సి రావడంతో ఇప్పటి వరకు 15,344 ఎకరాలకు మాత్రమే నీరు అందిస్తున్నారు. ఆధునికీకరణ పనులు పూర్తయితే నీటి నిల్వ సామర్థ్యం భారీగా పెరుగుతుంది. మరోవైపు పోలవరం ప్రాజెక్టు పూర్తయితే విశాఖకు పుష్కలంగా నీరు సరఫరా అవుతుంది. ఈ రెండు పనులు పూర్తయితే రైవాడ నీరు మొత్తం ఆయకట్టుకే వినియోగించేకునే అవకాశం లభిస్తుందని, అంతేకాక ఆయకట్టును మరింత విస్తరించే వెసులుబాటు కూడా వుంటుందని ప్రాజెక్టు పరిధిలోని రైతులు అభిప్రాయపడుతున్నారు.

మామిడి పంటకూ బీమా

... 5వ పేజీ తరువాయి

పంటలకు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, దిగుబడి ఆధారంగా నష్టపరిహారం చెల్లిస్తారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ విజయ్‌కృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయ్‌కృష్ణన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వాతావరణ ఆధారిత పంటల బీమా పథకానికి సంబంధించి ముద్రించిన బ్రోచర్‌లను ఆమెను ఆవిష్కరించి మాట్లాడారు. మామిడి, వరి, మినుము, పెసర పండించే రైతులకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులందరూ 2024-25లో రబీ పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ లేదా ఉద్యాన వన శాఖల సహాయకులను సంప్రతించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, ఉద్యాన వన శాఖ అధికారి ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

డెయిరీపై లోతుగా విచారణ

... 5వ పేజీ తరువాయి

వల్ల అటు పాడి రైతులు, ఇటు కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం విచారణకు ప్రత్యేక కమిటీని నియమించిందన్నారు. ఇకపై విశాఖ డెయిరీని ప్రణాళికాబద్ధంగా నడిపే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

రైతులు, కార్మికులకు అన్యాయం చేస్తే ఉపేక్షించం

విశాఖ డెయిరీ రైతులకు, కార్మికులకు న్యాయం చేయడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని కమిటీ ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ స్పష్టంచేశారు. డెయిరీలో విచారణ అనంతరం గేటు బయట దీక్ష చేస్తున్న కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విశాఖ డెయిరీ పురోభివృద్ధి చెందాలంటే పాడి రైతులు, కార్మికుల సేవలు అవసరమని, వారి విషయంలో ఎటువంటి అన్యాయం జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. కార్మికుల ఆందోళన, ఆవేదన చూస్తే యాజమాన్యం పెద్దగా స్పందించడం లేదన్న విషయం తెలుస్తుందన్నారు.

విచారణకు ఛైర్మన్ డుమ్మా

శాసనసభా కమిటీ సోమవారం డెయిరీలో విచారణకు వస్తున్న విషయం తెలిసినప్పటికీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ హాజరుకాలేదు. డెయిరీ ఎండీ ఎస్‌వీ రమణ, తొమ్మిది మంది డైరెక్టర్లు (మొత్తం 14 మంది డైరెక్టర్లు ఉన్నారు) మాత్రమే ఉన్నారు. డెయిరీపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఎండీ ఎస్‌వీ రమణ మాత్రమే సమాధానాలు ఇచ్చారు.

కుంచంగి వీఆర్‌ఓపై సస్పెన్షన్ వేటు

... 5వ పేజీ తరువాయి

1994లో ప్రభుత్వం ఐదు సెంట్ల పట్టా భూమి వచ్చింది. దీనిని 2020లో ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా వీఆర్‌ఓ కృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వం తీసుకుంది. ఇందుకు పరిహారంగా వీఎంఆర్‌డీఏ లేఅవుట్‌లో స్థలం కేటాయించాలి. అయితే వీఆర్‌ఓ బుదిరెడ్డి కృష్ణ. కొంతమేరకు విస్తీర్ణం తగ్గించి పట్టాదారు పాసుపుస్తకంలో నమోదు చేశారు. దీనిని సరిదిద్దేందుకు రూ.50 వేలు లంచంగా ఇవ్వాలని కృష్ణ డిమాండ్ చేశాడు. ఇందుకు అంగీకరించిన రామస్వామి గతంలో రూ.10 వేలు ఇచ్చాడు. మిగిలిన మొత్తం ఇస్తేనే పట్టాదారు పాస్‌పుస్తకంలో భూమి విస్తీర్ణం సరిచేస్తానని వీఆర్‌ఓ స్పష్టం చేశాడు. దీంతో వీఆర్‌ఓ భార్య బుదిరెడ్డి కళావతి ఫోన్‌పే నంబర్‌కు రామస్వామి ఇటీవల రూ.4 వేలు పంపాడు. అయినా వీఆర్‌ఓ సరిదిద్దకపోగా మిగిలిన మొత్తం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో రామస్వామి ఈ నెల 2వ తేదీన కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. దీంతోపాటు వీఆర్‌ఓ భార్యకు ఫోన్‌పే ద్వారా రూ.4 వేలు పంపినట్టు ఆధారాలను కూడా జత చేశాడు. దీనిపై విచారణకు కలెక్టర్ ఆదేశించారు. అనకాపల్లి తహసీల్దారు విజయ్‌కుమార్ క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. వీఆర్‌ఓ కృష్ణ గతంలో రామస్వామి నుంచి కొంత మొత్తం లంచంగా తీసుకున్నట్టు రుజువైంది. తహసీల్దారు నివేదిక ఆధారంగా వీఆర్‌ఓ బుదిరెడ్డి కృష్ణను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

ప్రాంతానికి గంజాయి రవాణా అవుతున్నట్టు రావికమతం మండలం కొత్తకోట పోలీసులకు సమాచారం అందింది. దీంతో సోమవారం తెల్లవారుజామున దొండపూడి చెక్‌పోస్టు వద్ద కల్యాణపులోవ రిజర్వాయర్ నుంచి వచ్చే దారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో అటుగా వస్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేయగా 110 కిలోల గంజాయి లభ్యమైంది. కారులో ఉన్న కేరళ రాష్ట్రం కాసరగోడ్ జిల్లాకు చెందిన ఒకరు, కర్ణాటక రాష్ట్రం పుట్టూరు ఉపజిల్లాకు చెందిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అల్లూరి జిల్లా పాడేరు ప్రాంతంలో ఒక వ్యక్తికి రూ.2.5 లక్షలు చెల్లించి గంజాయి కొనుగోలు చేసినట్టు వారు చెప్పారు. గంజాయిని తాజంగి, బుసిలికోట మీదుగా కూలీల సహాయంతో కల్యాణపులోవ రిజర్వ్ ఫారెస్టు ప్రాంతానికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి కారులో తరలిస్తుండగా దొండపూడి చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు.

అప్పన్న హుండీల ఆదాయం రూ. 2.81 కోట్లు

సింహాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి గత 39 రోజులకు గాను హుండీల ద్వారా సుమారు రూ.2.81 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు పర్యవేక్షణలో ఆ శాఖాధికారులు శ్రీధర్, ఎస్. శ్రీనివాస్ పరిశీలనలో సింహగిరిపై పరకామణి కేంద్రంలో సోమవారం హుండీల లెక్కింపు చేపట్టారు. రూ.2,81,93,913 నగదు రూపంలో రాగా 126.3 గ్రాముల స్వర్ణం, 15.14 కిలోల రజితంతో పాటు విదేశీ కరెన్సీ కూడా వచ్చింది.

4.3 కి.మీ.లు.. రూ.14 కోట్లు!

... 5వ పేజీ తరువాయి

కురిసినప్పుడల్లా వెర్రిగెడ్డ పొంగి, వాహనాల రాకపోకలు గంటల తరబడి నిలిచిపోతుంటాయి. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఒక్కసారి కూడా ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదు. ఫలితంగా రహదారి మరింత అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి శృంగవరం నుంచి గన్నవరంమెట్ట వరకు రోడ్డు అభివృద్ధికి రూ.14 కోట్లు మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణంతోపాటు మధ్యలో 10 కల్వర్టులు, మూడు వంతెనలు కూడా నిర్మిస్తారు. ఈ పనులు పూర్తయితే రెండు జిల్లాల ప్రజలకు రవాణా కష్టాలు తొలగుతాయని ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619